




తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

కర్నూలు : fb.com/vaartha

PUBLISHED FROM KURNOOL, VIJAYAWADA, HYDERABAD, VISAKHAPATNAM, RAJAHMUNDRY, KADAPA, NIZAMABAD, ONGOLE, WARANGAL, TIRUPATHI, ANANTAPUR, KARIMNAGAR, MAHABUBNAGAR, KHAMMAM, NELLORE, NALGONDA, GUNTUR, TADEPALLIGUDEM,SRIKAKULAM

3-1-2024 బుధవారం సంపుటి : 29 సంచిక : 334, పేజీలు : 10+4 వెల : 6.50







విశ్వసనీయతకు అర్థం చెబుతూ, మానవత్వానికి ప్రతిరూపంగా.. పెన్షన్లను క్రమంగా రూ. 3,000ల వరకు పెంచుకుంటూ పోతామని
ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ.. అవ్వాతాతలు, అక్కచెల్లెమ్మలు, అన్నదమ్ములకు బాసటగా ప్రేమతో జగనన్న ప్రభుత్వం మరింత పెంచి ఇస్తున్న..



# వైఎస్సార్ పెన్షన్ కానుక

## రంఛన్‌గా పెన్షన్

## ప్రతి నెలా రూ.3,000




రాష్ట్రవ్యాప్తంగా 1 జనవరి, 2024 నుండి 8 రోజులపాటు పండగ వాతావరణంలో పెన్షన్ల పెంపు ఉత్సవాలు..
నేడు కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజ్ గ్రౌండ్స్‌లో జరిగే కార్యక్రమంలో పాల్గొని,
పెంచిన పెన్షన్లను లబ్ధిదారులకు అందజేయనున్న గౌరవ ముఖ్యమంత్రి శ్రీ. వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి..

### ఆడబిడ్డకు ఆలంబనగా..



నా భర్త మరణంతో ముగ్గురు పిల్లల్ని పోషించుకోవడానికి టైలరింగ్ పనిచేశాను.. గత నాలుగేళ్లగా ఆరోగ్యం సహకరించక ఆ పని కూడా చేయలేక చాలా కష్టాలు పడ్డా.. జగనన్న ప్రభుత్వం అందిస్తున్న వితంతు పెన్షన్ కష్ట కాలంలో నా కుటుంబానికి ఎంతో అండగా నిలిచింది.

ఎస్. గుల్జార్, బీఎన్ఆర్ పేట, చిత్తూరు రూరల్ మండలం

### ఇంటి వద్దకే రేషన్, పెన్షన్ రావడం సంతోషం..



నా మనవడు జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత వృద్ధాప్య పెన్షన్ ఇప్పించాడు. నేను నడవటానికి కాళ్లు పనిచేయటం లేదు. నా ఇంటి వద్దకే వచ్చి పెన్షన్, రేషన్ అందిస్తున్నారు. అదీగాక ఈ నెల నుండి పెన్షన్ రూ. 3,000 కు పెంచటం సంతోషం.

అల్లంపాటి కొండమ్మ, ఆత్మకూరు, నెల్లూరు జిల్లా..

### పెన్షన్ కోసం పడిగాపులు తప్పాయి..



వికలాంగుల కోటాలో నాకు ప్రతి నెలా రూ. 3,000ల పెన్షన్ వస్తోంది. గతంలో పెన్షన్ తీసుకోవాలంటే పంచాయతీ కార్యాలయం వద్ద రోజంతా పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఉండేది.. ఇప్పుడు ప్రతి నెలా ఒకటో తేదీనే వాలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి పెన్షన్ ఇస్తున్నారు. మా వంటి దివ్యాంగులకు ఇది ఎంతో ఉపకారంగా ఉంది.

గొల్లపల్లె వెంకట చెన్నయ్య, మదూరు, తొండూరు మండలం, వైఎస్ఆర్ జిల్లా

### ఆస్పత్రిలో చేరిన నాకు నా బిడ్డ జగన్ డబ్బులు పంపాడు..



కూలీ పని చేసుకుంటూ జీవనం సాగించే నాకు ఎవరూ లేరు. అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరిన నాకు వాలంటీర్ ఇక్కడకు వచ్చి మరీ పెన్షన్ అందజేశారు. ఇచ్చిన మాట ప్రకారం వృద్ధాప్య పెన్షన్ ను రూ. 3,000 రూపాయలకు పెంచి ఇచ్చినందుకు చాలా సంతోషంగా ఉంది..

చెరుకుపల్లి అంకమ్మ, రామచంద్రనగర్, కర్నూలు జిల్లా



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి
శ్రీ. వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి

### అన్నీ తానై.. కొడుకులకంటే మిన్నగా..



గతంలో పెన్షన్ కోసం పంచాయతీ కార్యాలయం వద్ద పెద్ద క్యూలైన్లో నిలబడాల్సి వచ్చేది. ఆకలేస్తే ఒక బన్ను తెచ్చుకుని తిని నిలబడలేక అక్కడే బల్లమీద పడుకునేదాన్ని.. పెన్షన్‌కు వెళ్లాలంటేనే భయమేసేది.. జగనన్న ప్రభుత్వం వచ్చిన తర్వాత వాలంటీర్లు ఇంటికి వచ్చి నాకు పెన్షన్ ఇస్తున్నారు.. కొడుకు కన్నా మిన్నగా కొండంత అండగా జగన్ మోహన్ రెడ్డి అందిస్తున్న రూ. 3,000 పెన్షన్ డబ్బు మందులు, ఇతర ఖర్చులకు ఉపయోగపడుతుంది..

నర్సమ్మ, కర్నూలు అర్బన్

### పెద్ద కొడుకులా ఆదుకుంటున్నాడు..



భావిరెడ్డి నాగేశ్వరమ్మ, పొన్నూరు, గుంటూరు జిల్లా

కడుపున పుట్టిన బిడ్డలు పట్టించుకోకపోయినా సీఎం జగన్ ప్రతి నెలా పెన్షన్ ఇచ్చి ఆదుకుంటున్నాడు. అధికారంలోకి రాగానే పెన్షన్ రూ.2,250కి పెంచి, ఏటా పెంచుతూ ప్రస్తుతం రూ.3,000 ఇవ్వటం ఆనందంగా ఉంది. ఇంటి వద్దకే వచ్చి పరీక్షలు చేసి షుగర్ బిళ్లలు సైతం ఉచితంగా ఇవ్వటంతో మందుల ఖర్చు కూడా లేదు. ఏ సహాయం లేని మాలాంటి వారి జీవితాల్ని నిలబెడుతున్న ఈ ముఖ్యమంత్రి చిరకాలం చల్లగా ఉండాలని కోరుకుంటున్నాను.

### గతంలో ఎవరూ ఇలా పేదలను పట్టించుకోలేదు..



గతంలో ఏ ప్రభుత్వం ఇలా పేద ప్రజల బాగోగులను పట్టించుకోలేదు. సచివాలయ వ్యవస్థ ద్వారా ఈరోజు గ్రామాలు చల్లగా ఉన్నాయి. సూర్యోదయానికి ముందే వాలంటీర్లు మా ఇంటికొచ్చి పెన్షన్ డబ్బులు ఇస్తున్నారు. పెంచిన రూ. 3,000 పెన్షన్ తో నేను చాలా తృప్తి పడుతున్నాను.

రాము, గుళ్ల సీతారాంపురం, సంతకవిటి మండలం, విజయనగరం జిల్లా

### కనిపించే దేవుడు మా జగనన్న..



గతంలో పెన్షన్ ఇచ్చే సమయానికి గ్రామంలో లేకపోతే చాలా ఆందోళన ఉండేది. నేడు జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రతి నెలా వాలంటీర్లు మా ఇంటికే వచ్చి పెన్షన్ అందించడం ఎంతో సంతోషంగా ఉంది. కరోనా కష్ట కాలంలో కూడా నాకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పెన్షన్ అందచేసిన ఘనత జగన్‌కే దక్కుతుంది.

జి. చిన్నమ్మ, కచ్చిరదేవరాయపల్లి, అనంతసాగరం మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా

జగనన్న ప్రభుత్వం ఇస్తున్న పెన్షన్లు అందుకుంటున్న 66.34 లక్షల మంది అవ్వాతాతలు, అక్కచెల్లెమ్మలు, అన్నదమ్ముల మనోగతం కూడా ఇదే..!!



| గత ప్రభుత్వంలో.. | జగనన్న ప్రభుత్వంలో.. |
|---|---|
| ఎన్నికలకు 2 నెలల ముందు వరకు ఇచ్చిన పెన్షన్ నెలకు కేవలం రూ. 1,000 | జగనన్న ప్రభుత్వం పెంచి ఇస్తున్న పెన్షన్ నెలకు రూ.3,000 |
| ఎన్నికలకు 6 నెలల ముందు వరకు ఇచ్చిన పెన్షన్ల సంఖ్య కేవలం 39 లక్షలు.. | పెన్షన్ల సంఖ్య 66.34 లక్షలు.. |
| సగటున ఖర్చు చేసిన మొత్తం నెలకు రూ. 400 కోట్లు మాత్రమే.. | జగనన్న ప్రభుత్వం పెన్షన్లపై చేస్తున్న ఖర్చు నెలకు రూ. 1,968 కోట్లు.. ఇది గత ప్రభుత్వం చేసిన ఖర్చు కంటే దాదాపు ఐదు రెట్లు అధికం.. |



1 జనవరి, 2024 నుండి 66.34 లక్షల పెన్షన్లపై ఏటా చేయనున్న వ్యయం రూ.23,556 కోట్లు..
జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఇప్పటి వరకు పెన్షన్ల ద్వారా అందించిన
మొత్తం లబ్ధి అక్షరాల రూ. 83,526 కోట్ల పైమాటే..



డా॥ ఆదిమూలపు సురేష్, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామాత్యులు

శ్రీ. బూడి ముత్యాల నాయుడు, ఉప ముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖామాత్యులు

గమనిక: రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ. వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి 'వైఎస్సార్ పెన్షన్ కానుక ' లో భాగంగా 3 జనవరి, 2024 నాడు ఉదయం 10 గంటలకు కాకినాడలో పెంచిన పెన్షన్లను లాంఛనంగా అందిస్తారు. ఈ కార్యక్రమాన్ని అన్ని ప్రముఖ న్యూస్ ఛానళ్లలో లైవ్ లో వీక్షించవచ్చు..

జారీచేసినవారు: కమిషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

మాసెల్
గత వారం రోజుల పై విశ్లేషణ
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
కర్నూలు : fb.com/vaartha
PUBLISHED FROM KURNOOL, VIJAYAWADA, HYDERABAD, VISAKHAPATNAM, RAJAHMUNDRY, KADAPA, NIZAMABAD, ONGOLE, WARANGAL, TIRUPATHI, ANANTAPUR, KARIMNAGAR, MAHABUBNAGAR, KHAMMAM, NELLORE, NALGONDA, GUNTUR, TADEPALLIGUDEM,SRIKAKULAM
3-1-2024 బుధవారం సంపుటి : 29 సంచిక : 334, పేజీలు : 10+4 వెల : 6.50

మాజీ ఎంపి వై.శాంత వైఎస్సార్సీపీలో చేరిక 2లో

దాడి వీరభద్రరావు రాజీనామా: టిడిపిలో చేరే అవకాశం



## భగ్గుమన్న విమానాలు

### టోక్యో విమానాశ్రయంలో రెండు ప్లేన్లు ఢీ ఐదుగురు దుర్మరణం

**టోక్యో, జనవరి 2:** జపాన్ ఎయిర్‌పోర్టులో మంగళవారం ఘోరప్రమాదం సంభవించింది. రాజధాని టోక్యోలని ఓ విమానాశ్రయం రన్‌వేపై ఉన్న విమానంలో అనూహ్యంగా మంటలు చెలరేగాయి. హోకియాడో నుంచి వస్తున్న జపాన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన జెఎఎల్-516 విమానం ప్రమాదానికి గురైంది. హనెడా ఎయిర్‌పోర్టులో ల్యాండ్ అవుతుండగా మంటలు వ్యాపించినట్లు అంతర్జాతీయ మీడియా పేర్కొంది. దీంతో విమానంలోని 379 మంది ప్రయాణికులు, 12 మంది సిబ్బందిని తక్షణమే ఖాళీ చేయించారు. ఈ ప్రమాదంలో ఐదుగురు మృత్యువాత పడిన అధికారులు తెలిపారు. విమానం నుంచి పెద్దఎత్తున మంటలు ఎగిసిపడుతున్న ఫొటోలు, విడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. తర్వాత అగ్నిమాపక సిబ్బంది విమానాశ్రయానికి చేరుకుని.. దాదాపు 70 ఫైర్‌ఇంజిన్‌లతో మంటలను అదుపులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ప్రమాదానికి గల స్పష్టమైన కారణం తెలియరాలేదు కానీ విమానం ఎయిర్‌పోర్టులో ల్యాండ్ అవుతుండగా అక్కడే ఉన్న కోస్ట్‌గార్డ్ విమాన్నా ఢీకొనడం వల్లే ఈ ఘటన జరిగినట్లు విమానాశ్రయ అధికారులు జాతీయ మీడియా ఎన్‌హెచ్‌కెకు తెలిపారు. ప్రమాద ఘటనపై విచారణ జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

అయితే కోస్టుగార్డ్ ఎయిర్‌క్రాఫ్ట్‌లో మొత్తం ఆరుగురు సిబ్బంది ఉండగా.. వారిలో పైలట్ ప్రమాదం నుంచి తప్పించుకోగా మిగతా అయిదుగురు మరణించినట్లు విమానాశ్రయ అధికారులు తెలిపారు. ఘటన తర్వాత హనెడా విమానాశ్రయాన్ని పూర్తిగా మూసివేసినట్లు చెప్పారు.

# అందరికి నాణ్యమైన వైద్యం

## ఇక జగనన్న ఆరోగ్య సురక్ష-2

### ప్రతి ఇంటికి ఉచిత వైద్యం అందిస్తామన్న భరోసా

### వారానికి రెండురోజుల కార్యక్రమం: సీఎం జగన్



**విజయవాడ,జనవరి2,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని సామాన్య, మధ్యతరగతి కుటుంబాలవారి అనుహ్యాపరిస్థితుల్లో ఎంతటి వైద్య సేవలను ప్రభుత్వం అందిస్తుందనే భరోసాను కల్పించామని ఏపీ సీఎం వైఎస్ జగన్మోహనరెడ్డి స్పష్టం చేసారు.అందుకే ఆరోగ్యశ్రీ పరిధిలో 25 లక్షల వరకు ఉచిత వైద్యసేవలను అందిస్తున్నామన్నారు. మన రాష్ట్రంలోనే కాకుండా పొరుగు రాష్ట్రాల్లోను నిర్దేశిత నెట్‌వర్కు ఆస్పత్రుల్లో ఈ వైద్యసేవలు అందుబాటులోకి తెచ్చామన్నారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబం,ప్రతి పౌరుడి ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న 'జగనన్న ఆరోగ్య సురక్ష(జెఏఎస్)' రెండోదశ అమలుకు వైద్య ఆరోగ్యశాఖ మంగళవారం నుంచి ప్రారంభమైంది.ఈ సందర్భంగా వై సామాజిక మాధ్యమం వేదికగా సీఎం జగన్ సందేశమిస్తూ జగనన్న ఆరోగ్య సురక్ష-2కార్యక్రమం నేటినుంచి ప్రారంభమవుతుందన్నారు. వారానికి రెండురోజుల చొప్పున నిర్వహిస్తారన్నారు.ఇక పట్టణాలు, నగరాల్లో రెండో దశ కార్యక్రమం బుధవారం నుంచి ప్రారంభమవుతుంది.తొలిదశలో భాగంగా సెప్టెంబరు,అక్టోబర్, నవంబరులో 50రోజుల పాటు ఈ శిబిరాన్ని నిర్వహించింది. రెండో దశను నిరంతాయంగా జగన్న ఆరోగ్య సురక్షను అమలు చేస్తారు.ఆరు నెలల్లో 13,954 సురక్ష శిబిరాలు నిర్వహించేలా వైద్యశాఖ ప్రణాళికను రూపొందించింది.గ్రామాల్లో 10,032, పట్టణాలు,నగరాల్లో 3,922 చొప్పున శిబిరాలు నిర్వహించనున్నారు.ఈ నెల 3,588 శిబిరాలను నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేసారు.జగనన్న ఆరోగ్య సురక్ష తొలిదశలో ఆరోగ్య సిబ్బంది 1,45,35,705 గృహాలను సందర్శించారు. 6,45,06,018లక్షల మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు.ఆరోగ్యశిబిరాల్లో 60,27,843రోగుల నమోదులు జరిగాయి.గ్రామీణప్రాంతాల్లో 10,033,అర్బన్ ప్రాంతాల్లో 2,390 మొత్తం 12,423 సురక్ష వైద్యశిబిరాలు నిర్వహించారు.తదుపరి వైద్యం కోసం ఆరోగ్యశ్రీ నెట్‌వర్కు ఆస్పత్రులకు 1,64,982 మందిని రిఫర్ చేసారు.సీఎం జగన్ తన సందేశంలో ఈ అంశాలన్నింటిని ప్రస్తావిస్తూ జేఏఎస్-2 కార్యక్రమం అమలు పర్యవేక్షణకు వైద్య,ఆరోగ్యశాఖ జిల్లాల వారిగా ప్రత్యేకంగా అధికారులను నియమించింది.వీరు తమకు కేటాయించిన జిల్లాలో పర్యటించి క్షేత్రస్థాయిలో కార్యక్రమం అమలును పర్యవేక్షిస్తారు. లోటుపాట్లు ఉంటే సంబంధిత విభాగాల అధిపతుల దృష్టికి తీసుకుని వచ్చి.సమస్యను పరిష్కరించుకోవాలి.జెఏఎస్-2 నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసామన్నారు.మందులు,వైద్య పరీక్షల కిట్లు సరఫరా చేసామన్నారు.శిబిరాల నిర్వహణకు జిల్లా యంత్రాంగాలు షెడ్యూల్ రూపొందించాయన్నారు. కార్యక్రమానికి ఎటువంటి అవాంతారాలు లేకుండా శిబిరాలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వ వైద్యసేవలను ప్రజల వద్దకు చేరుస్తూ జెఏఎస్-2 కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరు ఈ సేవలను వినియోగించుకోవాలన్నారు.రాష్ట్రంలో పేదలకు మెరుగైన వైద్య ఆరోగ్యసేవలు అందించే విషయంలో ఎక్కడా తగ్గొ దన్నారు. ఆరోగ్యశ్రీపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు.కమ్యూనిటీ హెల్ ఆఫీసర్లు,ఎఎన్‌ఎంలు,ఆశావర్కరులు ఈ విషయంలో విస్తృత ప్రచారం సాగించాలన్నారు. కొత్త ఆరోగ్యశ్రీకార్డులు ఇవ్వాలన్నారు. 1,42,34,464 మందికి కొత్తగా కార్డులు ఇచ్చే ఏర్పాట్లుప్రతి ఒక్కరి ఫోన్లో ఆరోగ్యశ్రీ, దిశ యాప్‌లు ఉండాలన్నారు, జగనన్న ఆరోగ సురక్ష కార్యక్రమంలో గుర్తించిన రోగులకు ≫2



మంగళవారం ఎన్టీఆర్ జిల్లాలో ఆందోళన చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

# 5 లోగా విధుల్లోకి రండి

## అంగన్వాడీ కార్యకర్తలకు ప్రభుత్వం హెచ్చరిక

### లేకుంటే శాఖాపరమైన చర్యలు, ప్రతి కార్యకర్తకు నోటీసులు

**విజయవాడ,జనవరి2,ప్రభాతవార్తప్రతినిధి:** అంగన్‌వాడీకార్యకర్తలు ఈనెల5వ తేదీలోపు విధుల్లో చేరాలని, లేనిపక్షంలో వారిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని ఏపీ ప్రభుత్వం హెచ్చరించింది.ఆమేరకు వారికి నోటీసులు జారీ చేసింది.వారి డిమాండ్లన్నింటిని దాదాపుగా ప్రభుత్వం పరిష్కరించిందని,వేతం పెంపు అంశంపై సంక్రాంతి తరువాత ప్రభుత్వం మరో పర్యాయం చర్చలు జరుపుతుందని వివరించింది.అంగన్‌వాడిలకు సమ్మె కారణంగా ఎదురవుతున్న ఇబ్బందులను నోటీసుల్లో వివరించింది.గతంలో ఏ ప్రభుత్వం ఇవ్వని రీతిలో వారికి సదుపాయాలు,ప్రయోజనాలు కల్పించినా సమ్మె పేరిట పేద వర్గాలకు ఇబ్బంది కలిగించడం సరికాదని స్పష్టం చేసింది.అంగన్‌వాడీ కార్యకర్తలు,హెల్పర్లుకు 'ప్రభుత్వ విజ్ఞప్తి' పేరిట నోటీసులు జారీ చేసింది.సీఐటీయు ఆధ్వర్యంలో ఇతర కార్మికసంఘాల మద్దతుతో గత 22 రోజులుగా అంగన్‌వాడీ కార్యకర్తలు కనీస వేతనం రూ.26వేలకు పెంచాలని,గ్రాట్యూటీ సహా న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఆందోళన చేస్తున్నారు.వారి ఆందోళన నేపథ్యంలో వారితో నాలుగు ధపాలు చర్చలు జరిపింది.సమస్యలు పూర్తి పరిష్కరించేంత వరకు తాము ఆందోళన ఆపే పనిలేదని అంగన్‌వాడీలు వివిధరూపాల్లో ఆందోళనను తీవ్రతరం చేశారు. ≫2

# చంద్రబాబు 'రా..కదలిరా!'



మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు , పార్టీ నేతలు

## 5 నుంచి 29దాకా 22 సెగ్మెంట్ల పరిధిలో బహిరంగ సభలు

### టిడిపి-జనసేన సంయుక్తంగా నిర్వహణ

### టిడిపిలో చేరికలకు రెండు కమిటీలు

### పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు

**అమరావతి, జనవరి 2, ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రవ్యాప్తంగా 'రా.కదలిరా' పిలుపుతో ఈనెల 5వ తేదీ నుంచి టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ప్రజల్లోకి రాబోతున్నారని రాష్ట్ర టిడిపి అధ్యక్షుడు అచ్చెన్నాయుడు తెలిపారు. టిడిపి-జనసేన సంయుక్తంగా నిర్వహించే ఈ సభలకు చంద్రబాబుతోపాటు జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ హాజరవుతారని తెలిపారు. మంగళవారం టిడిపి జాతీయ కార్యాలయంలో అచ్చెన్నాయుడు ఆయా వివరాలను మీడియాకు తెలిపారు. 3వ తేదీన పార్టీకార్యాలయానికి సమీపంలోని కన్వెన్షన్ సెంటర్‌లో రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం సమాచారం నిర్వహించబోతున్నామన్నారు. 4న పార్టీ జాతీయ కార్యాలయంలో చంద్రబాబుచే 'జయహో బిసి' ప్రారంభం అవుతుందన్నారు. బిసిలను ఈ ప్రభుత్వం జగన్‌రెడ్డి ఎంత దారుణంగా వంచించారో, ఎంతగా వారిపై దమనకాండ సాగిస్తున్నారో ప్రతి బిసి కుటుంబానికి తెలియజేసేలా బలహీనవర్గాల్లో చైతన్యమే లక్ష్యంగా టిడిపి కార్యక్రమం ఉంటుందన్నారు. అదేవిధంగా టిఎన్‌టియుసి విభాగం ఆధ్వర్యంలో కార్మికుల్లో చైతన్యం తీసుకురావటమే ధ్యేయంగా త్వరలో రాష్ట్రవ్యాప్తంగా బస్సు యాత్ర ఉంటుందన్నారు. వైకాపా అభ్యర్థుల కొత్త జాబితా ప్రకటిస్తానన్న జగన్‌రెడ్డి, సొంత పార్టీలోని అసమ్మతులు, అసంతృప్తులకు భయపడి పిల్లిలా వెనకడుగు వేశారన్నారు. జగన్‌రెడ్డిని సొంతపార్టీ నేతలే విశ్వసించటంలేదన్నారు. టిడిపిలో చేరటానికి చాలా మంది వైకాపా నేతలు సిద్ధంగా ఉన్నారన్నారు.

**ప్రజాచైతన్యమే లక్ష్యంగా రాబోయే 100 రోజుల్లో నిర్విరామంగా టిడిపి కార్యక్రమాలు:** 2019లో జగన్‌రెడ్డి సిఎం అయ్యాక రాష్ట్ర రూపురేఖలు పూర్తిగా మారిపోయాయని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను ఆందోళనాంధ్రప్రదేశ్‌గా మార్చారన్నారు. 22 రోజులకు పైగా అంగన్‌వాడీ సిబ్బంది నిరవధిక సమ్మె చేస్తుంటే సిఎంలో చలనంలేదన్నారు. సర్వశిక్షా అభియాన్ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు,ఆశావర్కర్లు అందరూ జగన్‌రెడ్డిని నమ్మి మోసపోయామని, తమకు న్యాయం చేయాలని రోడ్లెక్కారని అన్నారు. జగన్ దుర్మారగపు పాలనకు ముగింపు పలకటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ 100 రోజుల్లో ఈ ప్రభుత్వం, జగన్‌రెడ్డి వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వారిలో చైతన్యం తీసుకురావటానికి టిడిపి నిర్విరామంగా కార్యక్రమాలు చేపట్టనుందని అచ్చెన్నాయుడు వివరించారు.

**పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా భారీ బహిరంగ సభలు:** 5న ఒంగోలు పరిధిలోని కనిగిరి, 6న విజయవాడ పరిధిలోని తిరువూరు, నరసాపురం పరిధిలోని ఆచంట,9న తిరుపతి పరిధిలోని వెంకటగిరి, నంద్యాల పరిధిలోని ఆళ్లగడ్డ, 10న విజయనగరం పరిధిలోని బొబ్బిలి, కాకినాడ పరిధిలోని తుని, 18న ఎన్టీఆర్ వర్థంతి పురస్కరించుకుని మచిలీపట్నం పరిధిలోని గుడివాడలో భారీస్థాయిలో సభ జరుగుతుందన్నారు. ≫2

# 25మందితో రెండో జాబితా

## వైఎస్సార్సీ నియోజకవర్గ అసెంబ్లీ ఇన్‌-చార్జిల పేర్లు వెల్లడి

**విజయవాడ,డిసెంబరు2,ప్రభాతవార్తప్రతినిధి:**గెలుపు లక్ష్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ అసెంబ్లీ ఇన్‌చార్జిలు 25మందితో రెండో జాబితాను విడుదల ఆ పార్టీ విడుదల చేసింది.ఇద్దరు ఎంపీ అభ్యర్థులను మార్చింది.ఈ జాబితాల్లో అయిదుగురిని ప్రస్తుత ఎంఎల్‌ఎ అభ్యర్థులకు,16 మంది కొత్త వారికి కేటాయించింది.సుదీర్ఘ కసరత్తు తరువాత ఈ జాబితా విడుదల సీఎం జగన్ మంగళవారం రాత్రి అనుమతించారు. ఈ జాబితాను విడుదల చేసే ముందు సీఎం జగన్ రీజినల్ కోఆర్డినేటర్లుతో చర్చించారు.అనంతరం వైకాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంత్రి బొత్స సత్యనారాయణ, వైకాం గ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామాకృష్ణారెడ్డి మీడియా విడుదల చేసారు.అన్ని కోణాల్లో చర్చించిన తరువాతనే తాము ఈ జాబితాను విడుదల చేస్తున్నామన్నారు. 175 స్థానాల్లో తమ పార్టీ అభ్యర్థులను ఎంపిక చేసారు.ఈ రోజు విడుదల చేసిన జాబితాల్లో మంత్రి గుడివాడ అమర్నాధ్‌రెడ్డికి చోటు దక్కలేదు.సమాచార శాఖా మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల్‌కృష్ణ(వేణు), మరో మంత్రి ఉషాశ్రీచరణ్‌లకు స్థానం చలనం జరిగింది. తిరుపతిలో భూమ అభినయ రెడ్డి,.పిఠాపురం నుంచి ఎంపీ వంగా గీత, రాజమండ్రి సిటీ నుంచి మార్గాని భరత్, పత్తిపాడు నుంచి వరపుల సుబ్బారావు, రామచంద్రాపురం నుంచి పిల్లి సూర్యాప్రకాశ్, మచిలిపట్టణం నుంచి పేర్ని కృష్ణమూర్తి(కిట్టు),రాజం నుంచి తాళ్ళ రాజేష్,అనకాపల్లి నుంచి మలసాని భరత్‌కుమార్, పాయకరావుపేట నుంచి కంబాల జోగులు,పి.వేణుగోపాల్, రాజమంత్రి గ్రామీణం నుంచి చెల్లుబోయిన వేణు, పోలవరం తెల్లం రాజ్యలక్ష్మి, కదిరి మక్బూల్ అహ్మద్, చంద్రగిరి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి,పెనుగొండ నుంచి మంత్రి కెవి ఉషాచరణ్, కల్యాణదుర్గం నుంచి తలారి రంగయ్య,అరకు నుంచి గొడ్డేటి మాధవి,పాడేరు నుంచి విశ్వేశ్వరరావు,విజయవాడ సెంట్రల్ నుంచి వెల్లంపల్లి శ్రీనివాస్, విజయవాడ వెస్ట్‌నుంచి షేక్ ఆసిఫ్, జగ్గం పేట తోట నరసింహం, యర్రగొండపాలెం ఎస్సీ నియోజకవర్గం నుంచి తాటిపత్రి చంద్రశేఖర్, ఎమ్మిగనూరు మాచాని వెంకటేష్,గుంటూరు ఈస్ట్ షేక్ నూరిపాతిమాలకు సమన్వయకర్తలుగా ఆహ్వానం కల్పించారు.

దాదాపుగా వీరే వచ్చే ఎన్నికల్లో అభ్యర్థులుగా ఉంటారని మంత్రి బొత్స తెలిపారు.ఈ జాబితా పేర్ని నాని, పిల్లిసుభాష్ చంద్రబోస్,చిప్‌విప్ చెవిరెడ్డి భాస్కరరెడ్డి,గుంటూరు ఎంఎల్‌ఏగా పాతిమాలకు వారసులుగా టిక్కెట్లు లభించాయి.ఇక అనం తపురం ఎంపీగా లక్ష్మినారాయణ స్థానంలో మాలగుండ్ల శంకరనారాయణకు,హిందుపురం ఎంపీ అభ్యర్థిగా జోలదరాశి శాంతలకు అవకాశం కల్పించారు.ఈ జాబితా వాస్తవానికి డిసెంబరు మాసాంతంలో వెల్లడి కావాల్సి ఉంది.అయితే ఒక కీలక సామాజిక వర్గ నాయకుడు ముద్రగడ పద్మనాభం,వంగవీటి రంగా కుమారుడు రాధాకృష్ణలు చేరిక స్పష్టత కోసం ఎదురుచూసిన సీఎం జగన్ నేడు జాబితాను ప్రకటించారు.ఒక వేళ ముద్రగడ వైకాంగ్రెస్ పార్టీలోకి వస్తే ఆయనకు కాకినాడ ఎంపీ స్థానం ,ఆయన కుమారునికి తుని స్థానం,వంగవీటి రాధా పార్టీలోకి వస్తే బందరు పార్లమెంటులేదా అవనిగడ్డ ఎంఎల్‌ఏ అభ్యర్థిత్వం ఇచ్చే అవకాశం ఉందంటున్నారు.

తొలి జాబితాలో 11 మంది అభ్యర్థులు.ఈ జాబితాలో 25 మంది అంట 36 మంది అభ్యర్థులను ప్రకటించింది. మరో మూడు,నాలుగు రోజుల్లో మరో 15మందితో కూడిన జాబితా విడుదల అయ్యే అవకాశం ఉంది.

# తెలుగువైభవ శోభాయాత్ర

### ప్రపంచ తెలుగు మహా సభలకు నాందిగా ర్యాలీని ప్రారంభించిన స్వాత్మానందేంద్ర సరస్వతి

### సభలను విజయవంతం చేయండి: గజల్ శ్రీనివాస్, చైతన్యరాజు

మంగళవారం తెలుగువైభవ శోభాయాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న స్వాత్మానందేంద్ర సరస్వతి, గజల్ శ్రీనివాస్ తదితరులు



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, జనవరి 2, ప్రభాతవార్త:** తల్లిని గౌరవించినట్లే.. అమ్మ భాషను గౌరవించాలని విశాఖపట్నం శారదా పీఠం ఉత్తరాధికారి శ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామి ఉద్బోధించారు. ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 5, 6, 7 తేదీల్లో గైట్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో అంగరంగ వైభవంగా అంతర్జాతీయ తెలుగు మహాసభలు నిర్వహించనున్న నేపథ్యంలో మంగళవారం తూర్పుగోదావరిజిల్లా రాజమండ్రిలో తెలుగుభాషా వైభవ శోభాయాత్ర నిర్వహించారు. తెలుగు మహాసభలకు సంఘీభావంగా అపుస్మా ఆధ్వర్యంలో తెలుగు వైభవాన్ని చాటుతూ చేపట్టిన 'తెలుగు భాషా వైభవ శోభాయాత్ర' ఉదయం స్థానిక కంబాల చెరువు దండి మార్చ్ ≫2

## కార్యాలయాలు విశాఖకు తరలింపుపై

# మరో బెంచ్ విచారణకు కేసు

**విజయవాడ,జనవరి2,ప్రభాతవార్తప్రతినిధి:** విశాఖకు ప్రభుత్వ కార్యాలయాల తరలింపు అంశంపై హైకోర్టులో కీలక పరిణామం చోటు చేసుకుంది.ఈ కేసును త్వరగా విచారించాలంటూ ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు విచారణ స్వీకరించింది.నేడు విచారణ సందర్భంలో హైకోర్టు 'నాట్ బీఫోర్ మీ" అని వ్యాఖ్యానిస్తూ కేసును మరో బెంచి పరిధిలో విచారణ చేయించాలని రిజిస్ట్రీని ఆదేశించింది. పిటిషన్ త్వరగా విచారణకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని హైకోర్టును అడ్వోకేట్ జనరల్ శ్రీరామ్ కోరారు.కార్యాలయాల తరలింపుపై త్రిసభ్య ధర్మాసనం విచారించే వరకు తదుపరి చర్యలు తీసుకోవద్దని గతంలో సింగిల్ ఆదేశాలిచ్చింది.ఈ కేసు త్వరగా విచారించాలని ఏపీ ప్రభుత్వం దాఖలు చేసి పిటిషన్‌ను ఇటీవల హైకోర్టు వేసింది.విచారణను నేటికి వాయిదా వేసి,విచారణ మరో బెంచికి బదలాయించాలని ఆదేశించింది.

# దేశవ్యాప్తంగా ట్రక్కర్ల సమ్మె విరమణ

## కేంద్ర హోంశాఖ చర్చలు సఫలం

### పెట్రోలు కొరతతో హైదరాబాద్‌లో బారులు తీరిన వాహనాలు

**న్యూఢిల్లీ, జనవరి 2:** కేంద్రప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన న్యాయసంహిత చట్టంలో హిట్‌అండ్ రన్‌కేసులకు సంబంధించి శిక్షలు జరిమానాలు రెట్టింపుచేయడంపై దేశవ్యాప్తంగా రెండురోజులపాటు నిర్వహించిన నిరసన, సమ్మెనుట్రక్ యజమానులు నిలిపివేసారు.కేంద్ర హోంశాఖ కార్యదర్శి అజయ్‌భల్లాతో అఖిలభారత మోటార్‌ట్రాన్స్‌పోర్టు యూనియన్ నాయకులు చర్చలుజరపడం, ఆపై కేంద్రం నుంచి స్పష్టమైన హామీ రావడంతో తాము సమ్మెను నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. మంగళవారం సాయంత్రం ట్రాన్స్‌పోర్టుయూనియన్‌తో కేంద్రహోంశాఖ విస్తృత చర్చలుజరిపింది. సమావేశం అనంతరం హోంశాఖ కార్యదర్శి అజయ్‌భల్లా మాట్లాడుతూ కొత్తనిబంధన ఇంకా అమలులోకి రాలేదని, ట్రాన్స్‌పోర్టు సంఘాలతో విస్తృత చర్చలుజరిపన తర్వాతనే తుదినిర్ణయం తీసుకుంటామని తెలియజేసారు. అందరితో చర్చించిన తర్వాతనే కొతనత నిబంధన అమలుకు వస్తుందని హామీ ఇచ్చారు. ట్రక్కుడ్రైవర్లు సమ్మెను విరమించాలనికోరడంతో సంఘాలు తమ సమ్మెను విరమిస్తున్నట్లు ప్రకటించాయి. ఢిల్లీ,ముంబయి, కోల్‌కత్తా, అహ్మదాబాద్, లక్నో, చెన్నై, హైదరాబాద్ వంటి నగరాల్లోకూడా ట్రక్కులు, ఆయిల్ ట్యాంకర్లు లేకపోవడంతో మొత్తం వాహనాలన్నీ నిలిచిపోయాయి.ఇక రెండు తెలుగురాష్ట్రాలకు సంబంధించి ఎలాంటి ఆటంకాలు ఉండవని ఆలిండియా పెట్రోలియం డీలర్స్ కన్సార్టియమ్ జాయింట్ సెక్రటరీ రాజీవ్ అమరమ్ తెలిపారు. బుధవారం నాటికి పెట్రోలు బంకులన్నింటికీ ఆయిల్ ట్యాంకర్లు వెళతాయని, పరిస్థితి సాధారణ స్థాయికి వస్తుందని రాజీవ్ తెలిపారు. ఒక్క తెలంగాణలోనే 5.80 లక్షల గూడ్స్ వాహనాలువాటిలో 1.80లక్షలవరకూ భారీవాహనాలునిత్యంరవాణారంగంలో రాకపోకలు సాగిస్తుంటాయి.

వార్త


రచయిత ఆవేశం రచన చేసేవరకే కాదు, సమాజం మారే వరకూ ఉండాలి.

-చార్లెస్ డీగాల్

# కలవరపెడుతున్న భూకంపాలు


మానవుడు సాంకేతికంగా ఎంత పరిజ్ఞానం సంపాదించినా ఇతర రంగాల్లో మరెంత అభివృద్ధి సాధించినా ప్రకృతి ముందు తలవంచని పరిస్థితుల నుంచి బయటపడలేకపోతున్నాడు. భూకంపాలు, తుఫాన్, వరదల రూపంలో వస్తున్న ముప్పు నుంచి బయటపడలేక ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీకావు. లక్షలాది కోట్ల రూపాయల విలువైన పంటలు, ఆస్తులతోపాటు వేలాది మంది ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోతున్నాయి. నిన్న కొత్త సంవత్సరం ప్రారంభ సమయంలో జపాన్‌లో శక్తివంతమైన భూకంపం సృష్టించిన బీభత్సంతో ప్రజలు చిగురుటాకుల్లా వణికిపోయారు. సోమవారం సాయంత్రం నాలుగు గంటల తర్వాత పలు మార్లు భూప్రకంపనాలు కంపించాయి. వాటి తీవ్రత రెక్టర్ స్కేలుపై 7.6గా నమోదైనట్లు జపాన్ వాతావరణ సంస్థ ప్రకటించింది. భూకంపం ధాటికి సముద్రం ఐదడుగుల మేర అలలు ఎగిసిపడి అల్లకల్లోలంగా మారింది. పశ్చిమకోస్తా తీరంలోని ఇషిగావా, నిఘాటా, బొమయా జిల్లాల్లో తీవ్రసునామీ వచ్చే అవకాశాలున్నట్లు ప్రభుత్వం హెచ్చరించింది. ఆ తర్వాత తగ్గించినా మంగళవారం ఆ హెచ్చరికను ఉపసంహరించింది. ఈ భూకంపం వల్ల ఇళ్లు కంపిస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో ప్రచారం కావడంతో భయాందోళనలకు గురైన ప్రజలు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. భూకంప ప్రభావిత ప్రాంతాల్లో భారీ సంఖ్యలో ఇళ్లు కూలిపోయాయి. రాజధాని టోక్యోతోపాటు కాంటోప్రాంతాల్లో ప్రకంపనాలు నమోదయ్యాయి. అధికారులతోపాటు సైన్యంసహాయ కార్యక్రమాల్లో నిమగ్నమయ్యాయి. మరొకపక్క ఉభయ కొరియాలతోపాటు రష్యా ప్రభుత్వాలు అప్రమత్తమయ్యాయి. సముద్రపుమట్టం స్థాయిల్లో మార్పులను గమనిస్తూ ఉండాలని వాతావరణ సంస్థ సూచించింది. శిథిలాల కింద కొందరు ప్రజలు చిక్కుకుపోయినట్లు సమాచారం ఉన్నా ప్రాణనష్టం గురించి స్పష్టత లేదు. ఏదిఏమైనా ఈ సంవత్సరం ఆదిలోనే ఈ భూకంపం సృష్టించిన బీభత్సం నుండి జపాన్ ప్రజలు కోలుకోలేకపోతున్నారు. పర్యావరణానికి మానవుడు చేస్తున్న ద్రోహానికి ప్రతీకారంగా ప్రకృతి సృష్టిస్తున్న ఈ బీభత్సాలకు బలైపోతున్నాడు. పర్యావరణ పరిరక్షణ పట్ల ప్రపంచ నేతలు అంతర్జాతీయ సదస్సుల్లో ఎన్నో తీర్మానాలు చేస్తుంటారు, ప్రకటనలు గుప్పిస్తుంటారు. ఆచరణకు వచ్చేసరికి ఎవరి దారి వారిదే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో భూ వాతావరణంలో, భూమి అంతర్భాగంలోనూ ఎన్నో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఫలితంగా సంభవిస్తున్న అనేక విపరీత పరిణామాలు ప్రపంచ మానవాళికి అనేక సవాళ్లను సృష్టిస్తున్నాయి. అమెరికాలోని టెక్సాక్స్, ఫ్లోరిడా తీరాలను ప్రళయభయంకరంగా ఎన్నోసార్లు తుఫాన్లు విధ్వంసం సృష్టించాయి. అదే సమయంలో పన్నెండు రోజుల వ్యవధిలో మెక్సికోను రెండువరుస భూకంపాలు తీవ్రంగా కుదిపివేశాయి. 1985 సెప్టెంబరు 19న రెక్టర్ స్కేలుపై 8.1 తీవ్రతతో తాకిన పెనుభూకంపం మెక్సికోను అతలాకుతలం చేసింది. ఆ భూకంపం ధాటికి ఆనాడు పదివేల మంది మృత్యువాతపడ్డారు. సరిగ్గా ముప్పైరెండేళ్ల తర్వాత అదే నెలలో ఏడోతేదీన 8.2 తీవ్రతతో 19న 7.1తీవ్రతతో రెండు భయంకర భూకంపాలు మెక్సికోను అతలాకుతలం చేశాయి. అయితే ఈ భూకంపాలు గతంలో కంటే ప్రాణనష్టం తగ్గించగలిగారు. అయితే ఈ భూకంపాలు కొత్త సవాళ్లను విసిరాయి. పెనుభూకంపాలు వచ్చిన తర్వాత వెన్నంటి వచ్చే ప్రకంపనాల పరిధి వందకిలోమీటర్ల లోపే ఉంటుంది. వాటి తీవ్రత కూడా భూకంప లేఖినిపై 6.1లోపే ఉంటుంది. కానీ మెక్సికోలో వచ్చిన ప్రకంపన కేంద్రం 650 కిలోమీటర్ల దూరంలో ఉండడం తీవ్రత 7.1గా నమోదు కావడం భూవిజ్ఞాన శాస్త్రజ్ఞులను విస్తుపరిచింది. అదే సమయంలో జపాన్, న్యూజిలాండ్ దేశాల్లోనూ 6.1 తీవ్రతతో భూప్రకంపనాలు సంభవించడం సర్వత్రా ఆందోళన కలిగించాయి. సాధారణంగా భారీ ప్రాణ, ఆస్తి నష్టాలు కలిగించే ప్రకృతి విపత్తుల్లో వరదలు, తుఫాన్‌లు, కరవుకాటకాలు ఉంటాయి. వీటి రాక గురించి ముందుగానే కొంతమేరకు అంచనా వేసి నష్టనివారణ చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. కానీ ఎలాంటి సంకేతాలు లేకుండా ముందస్తు అంచనాలకు అవకాశం లేకుండా విరుచుకుపడే భూకంపాలు భారీ విధ్వంసాలకు దారితీస్తున్నాయి. భారతదేశంలో కూడా అరవై శాతం భూభాగం భూకంపాలు సంభవించే ప్రాంతాలుగాగుర్తించారు. ఈశాన్య రాష్ట్రాలు, హిమాలయ పర్వతప్రాంతాల వెంబడి భూభాగంలో అత్యధిక శాతం భూకంపాలు సంభవించే ప్రాంతాలు. ఈ ప్రాంతాలను భూకంప మండలాలుగా కూడా పిలుస్తున్నారు. హిమాలయాల తర్వాత ఉత్తర భారతదేశంలోని మైదాన ప్రాంతాలు ఢిల్లీ, పశ్చిమ ఉత్తరప్రదేశ్, బీహార్, దక్షిణాదిన కోస్తాతీరప్రాంతాలు భూకంపాలు సంభవించే అవకాశాలు ఉన్నట్లు శాస్త్రజ్ఞులు అంచనా వేస్తున్నారు. పర్యావరణ వినాశనానికి మానవుడు చేస్తున్న తప్పిదాలే అందుకు కారణాలవుతున్నాయనేది కాదనలేని వాస్తవం. భూకంపాలకు మానవ తప్పిదాలే కారణమన్నాయన్నది తాజా అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ప్రజా జీవితాలను అతలాకుతలం చేస్తున్న భూకంపాలను ముందస్తుగా పసిగట్టి సమర్థవంతంగా ఎదుర్కొనగలగడం ప్రపంచ దేశాలకు పెనుసవాలుగా మారింది. అయినా ఇంకా లక్ష్యానికి చేరుకోలేదనే చెప్పొచ్చు. అన్నింటికంటే పర్యావరణ పరిరక్షణే సమస్యను కొంతవరకైనా పరిష్కరిస్తుంది.

వయస్సులో ఉన్నప్పుడే మంచి పనులు చేయి. ఆలస్యం అయితే కాలం నీ చేతిలో ఉండదు.



ఎడ్వర్డ్ స్పెన్సర్

లక్ష్యం ఎంత ఉన్నతంగా ఉంటుందో దాన్ని సాధించడానికి ఎంచుకునే మార్గం కూడా అంతే సమున్నతంగా ఉండాలి.



రామకృష్ణ పరమహంస

# ఐరాస బలోపేతమే ప్రపంచశాంతికి మార్గం!

**పాక్‌ను భారత్‌లో విలీనం చేయాలనే డిమాండ్ ఆ దేశ ప్రజల నుండే వ్యక్తంకావడం విశేషం. ఇంత జరుగుతు న్నా భారత్‌తో పాక్ శతృత్వం కొనసాగించడం దురదృష్టకరం. ఇకనైనా ఐక్యరాజ్యసమితిని బలోపేతం చేయాలి. ఐక్యరాజ్యసమితి వైఫల్యం వలన మరో అంతర్జాతీయ సంస్థ ఆవిర్భవించే పరిస్థితులను కొట్టిపారేయలేం. అగ్రరాజ్యాలకు పాదాక్రాంతమయితే ఐక్యరాజ్యసమితి మనుగడ సాధ్యం కాదు. ఐ.రా.స తన మనుగడ కోసం నిధుల కోసం, విధులు మరచి, అగ్రదేశాలకు జేబు సంస్థగా మారితే ఎదురయ్యే పరిణామాలు ఊహాతీతం.**



సుంకవల్లి సత్తిరాజు

నిష్పాక్షికత లేని అంతర్జాతీయ వేదికలు నిష్ఫలం అనడానికి ఐక్యరాజ్యసమితి వ్యవహారమే మచ్చుతునక. అగ్రరాజ్యాల కర్రపెత్తనంతో ఐక్యరాజ్య సమితి తనఉనికిని కోల్పోతున్నది. ప్రపంచంలో పలు సమస్యల పరిష్కారానికి ఎన్నో అంతర్జాతీయ సంస్థలు ఏర్పడ్డాయి. ప్రజాప్రయోజనాల కోసం పాటుపడడమే ఈసంస్థ లక్ష్యం. ప్రపంచ గత చరిత్ర రాజ్యకాంక్షకోసం, సామ్రాజ్య విస్తరణకోసం జరిగిన యుద్ధాలతో, మారణహోమాలతో, భయంకరమైన రక్తపాతంతో అపారమైన జన నష్టంతో విషాదభరితమైన అధ్యాయాలతో నిండిపోయింది. వర్తమాన చరిత్ర కూడా ఇందుకు ఏమాత్రం భిన్నంగా లేదు. ప్రపంచంలో నెలకొన్న అస్తవ్యస్తమైన పరిస్థితులను మార్చడానికి ఆశావహ దృక్పథంతో ప్రయత్నించాలి. ప్రమాదకరమైన పరిస్థితులను చక్కదిద్దడంలో ఎలాంటి నిర్లక్ష్యం తగదు. ప్రయత్నం లేకుండా ఆశించిన ఫలితాలు లభించవు. అయితే అహంకారపూరిత వైఖరి వలన కొన్నిసార్లు యావత్ ప్రపంచం ప్రమాద స్థితిలోకి జారిపోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తున్నది. అహంకారంతో, యుద్ధకాంక్షతో, ఆయుధబలంతో, సైనిక బలగంతో కళ్లు నెత్తికెక్కి అమాయక ప్రజలను మృత్యుతీరాలకు చేరుస్తూ, శాంతిని దూరం చేస్తూ, మానవ మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్న దుశ్చర్యలను దునుమాడి, ప్రపంచంలో శాంతి స్థాపనకు కృషి చేయడమే ధ్యేయంగా ఐక్యరాజ్యసమితి ఏర్పడింది. అయితే ఐక్యరాజ్యసమితి ఉన్నతమైన ఆశయాలతో ఏర్పడినా, కేవలం అగ్రరాజ్యాల కనుసన్నల్లో పనిచేయడం, అన్ని దేశాలకు సమానన్యాయం వర్తింపచేయడంలో ఘోరవైఫల్యం చెందడం చూస్తున్నాం. రష్యా, ఉక్రెయిన్ యుద్ధాన్ని నివారించలేకపోవడం ఐక్యరాజ్య సమితి మూల సిద్ధాంతానికే ప్రమాదంగా మారింది. శాంతిస్థాపన కోసం ఏర్పడిన ఒక ప్రతిష్టాత్మక ప్రపంచ సంస్థ ద్వంద్వ వైఖరితో తన అస్తిత్వాన్ని కోల్పోవడం బాధాకరం. ఉక్రెయిన్, రష్యా యుద్ధానికి కేవలం అమెరికా, రష్యాల ఆధిపత్య ధోరణే కారణం. అలాగే ఎన్నో అంతర్జాతీయ వివాదాలకు ఐక్యరాజ్య సమితి పరిష్కారమార్గాలు అన్వేషించడంలో విఫలమైంది. ప్రపంచ శాంతికోసం ఒకవైపు సందేశాలివ్వడం, మరొకవైపు యుద్ధాలు జరుగుతుంటే ఐ.రా.స చేష్టలుడిగి చోద్యం చూడడం ఒక దానికొకటి పొంతన లేని చర్యలకు నిదర్శనం. మొదటి ప్రపంచయుద్ధంలో అపారమైన జననష్టం, ఆర్థికవనరుల విధ్వంసం జరగడం శాంతి కాముకులను బాధించింది. ఇలాంటి పరిస్థితులను నివారించడానికి 1945, అక్టోబరు 24వ తేదీన ఒక పెద్ద అంతర్జాతీయ సంస్థగా ఐక్యరాజ్యసమితి ఏర్పడింది. 77వసంతాలు పూర్తి చేసుకుని, 78వ వడిలో పడిన ఐక్యరాజ్యసమితి ప్రపంచంలో ప్రస్తుతం ఏర్పడిన సంక్షోభాలను అంతమొందించాలి. వివిధ దేశాల మధ్య నెలకొన్న వివాదాలకు స్వస్తి వాక్యం పలకాలి. అఫ్ఘాన్‌లో తాలిబన్ల అరాచకాన్ని నిలువరించకపోవడం, భారత్‌లో పాక్ కొనసాగిస్తున్న సీమాంతర ఉగ్రవాదాన్ని నిలువరించకపోవడం, భారత్ ఈశాన్య ప్రాంతాల్లో చైనా కొనసాగిస్తున్న దుర్నీతిని ప్రశ్నించకపోవడం ఐక్యరాజ్యసమితి వైఫల్యానికి మచ్చుతునక. భారత్ జనాభాలో ఇటీవల ప్రపంచంలో మొదటి స్థానం ఆక్రమించింది. భారత్ పెద్ద దేశం. పెద్ద ప్రజాస్వామ్య దేశం. ప్రపంచ శాంతికి తోడ్పడవలసిన అమెరికా, చైనాలు ఇతర దేశాలపై దాడి చేసినా ఐ.రా.స ధృతరాష్ట్ర పాత్రను పోషించడం క్షంతవ్యమా? భారతదేశం ఇరుగుపొరుగు దేశాలతో సత్సంబంధాలనే వాంఛిస్తున్నది. అయినప్పటికీ ఇరుగుపొరుగుదేశాలు ఈర్ష్యాద్వేషాలతో భారత్ సమగ్రతకు చేటుగా పరిణమించడం శోచనీయం. కొట్లాటల వలన, యుద్ధాలవలన ఎవరికీ ఒనగూడే ప్రయోజనం ఉండదు. ప్రజలే పరాజితులుగా మిగులుతారు. గతంలో జరిగిన రెండు ప్రపంచ యుద్ధాల పరిణామాలు ఈ విషయాన్నే నిరూపించాయి. ప్రాచీన కాలంలో యుద్ధాలన్నీ సంప్రదాయమైన ఆయుధాలతో జరిగేవి. ప్రస్తుతం అలాంటి పరిస్థితులు లేవు. మరో ప్రపంచ




యుద్ధం జరిగితే అది అణ్వస్త్ర యుద్ధానికే దారితీస్తుంది. ప్రస్తుతం ఐక్యరాజ్య సమితి హితవచనాలు వినే పరిస్థితుల్లో ఏ దేశములేదు. పేదదేశాలకే తప్ప అగ్రరాజ్యాలకు ఐ.రా.స కేవలం ఒక అవశేష అవయం లాంటిదే. ఐ.రా.స తన కార్యకలాపాల కోసం అధికంగా అగ్రరాజ్యలపై ఆధారపడడమే దీనికి కారణం. ఐ.రా.స నిష్పాక్షికత, విశ్వసనీయత కోల్పోతే మరో 'లీగ్ ఆఫ్ నేషన్స్' మాదిరిగా విఫలం కాక తప్పదు. వివిధ దేశాల నడుమ నెలకొంటున్న సరిహద్దు వివాదాలు యుద్ధాలకు దారితీయకుండా చూడవలసిన బాధ్యత ఐక్యరాజ్య సమితి భుజస్కంధాలపై ఉంది. గత కాలంలో జరిగిన యుద్ధ ఫలితాలు ప్రపంచానికే చేదు గుర్తులను మిగిల్చాయి. చెడు ఫలితాలతో చేదు అనుభవాలను పాఠాలుగా నేర్చాయి. ఈ పాఠాలు గుణపాఠాలు కావాలి. భవిష్యత్తులో యుద్ధాలంటే భయోత్పాతం కలగాలి. యుద్ధోన్మాదుల కొమ్ములు పెకలించే నిజమైన శాంతికాముకులు నేటి తరం నుండి ఉద్భవించాలి. శాంతియుత విధానమే ప్రపంచానికే శ్రేయస్కరం. శాంతియుత వాతావరణం ప్రపంచ మానవాళి మనుగడకు అత్యవసరం. ఎక్కడైతే శాంతికి విఘాతం కలుగుతుందో అక్కడ ప్రజల జీవితాలు దుర్భరం. అభివృద్ధి శూన్యం. గతంలో జరిగిన పలు సంఘటనలు ఈ విషయాన్ని ధృవీకరిస్తున్నాయి. ఆధిపత్య భావజాలం, సామ్రాజ్యవాదం, ఫ్యూడలిస్టు విధానాల వలన పలు దేశాల్లో ఎన్నో అవాంఛనీయ పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. యుద్ధాలవలన భౌగోళికంగా ఆధిపత్యం పెరగవచ్చునేమో కానీ ప్రజలు మాత్రం అంతిమ పరాజితులే. గతంలో జరిగిన రెండు ప్రపంచ యుద్ధాలు ఎన్నో చేదు అనుభవాలు మిగిల్చాయి. అయినప్పటికీ ప్రపంచ దేశాలు వీటి నుంచి గుణపాఠాలు నేర్చుకోలేదు. రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య కొనసాగుతున్న సుదీర్ఘ యుద్ధమే దీనికి ఉదాహరణ. దేశాల మధ్య సరిహద్దు తగాదాలు, ఉగ్రవాదం వంటి సమస్యల వలన తరచూ శాంతి భద్రతల సమస్యలు తలెత్తుతున్నాయి. అరాచకం ప్రబలితే అంతకంటే నరకం మరొకటుండదు. అఫ్ఘానిస్థాన్‌లో తాలిబన్ల దుశ్చర్యలు ఇందుకు నిదర్శనం. శాంతియుత జీవనమే సకల మానవాళి శ్రేయస్సుకు మూలం. అంతర్జాతీయ శాంతిసాధన కోసం ఐక్యరాజ్యసమితి తూ.తూ మంత్రంగా ప్రయత్నాలు చేస్తున్నది. చిత్తశుద్ధిలేనిమొక్కుబడి కార్యక్రమాలు ఫలితాలు సాధించలేవు. హింసను నివారించడం ద్వారా శాంతియుతమైన వాతావరణం కల్పించడం ఐక్యరాజ్యసమితి ప్రధాన ఉద్దేశ్యంకావాలి. అయితే ఐక్యరాజ్య సమితి ఒక్కో దేశానికి ఒక్కో విధమైన విధానం అనుసరిస్తూ, అగ్రరాజ్యాల కనుసన్నల్లో మెలగడం వలన ప్రపంచ శాంతి కోసంఏర్పడిన ఈ అంతర్జాతీయసంస్థ పట్ల నానాటికీ ప్రజల్లో విశ్వసనీయత సన్నగిల్లుతున్నది. అంతర్జాతీయ శాంతికి విఘాతం కలిగిస్తున్న దేశాలపై ఉదాసీనవైఖరి ప్రదర్శించడం సబబుకాదు. భారతదేశానికి, ఇతర దేశాలకు విదేశాంగ విధానాల్లో చాలా వ్యత్యాసముంది. అంతర్జాతీయ ఒప్పందాలకు కట్టుబడి ఉండడం కూడా భారత్‌కు ప్రపంచంలో విశ్వసనీయత సంపాదించి పెట్టింది. అదే సందర్భంలో భారత దేశ శాంతి వచనాలను పరాయి దేశాల పాలకులు అసమర్థతగా భావించారు. అయితే క్రమేపీ భారతదేశం కూడా ఈ వాస్తవాన్ని గ్రహించి దూకుడుగా ముందుకు సాగవలసిన అవసరం ఏర్పడింది. మనదేశ ప్రయోజనాలను సైతం పక్కనపెట్టి బలహీన దేశాలపట్ల భారతదేశం చూపించిన ఔదార్యం చరిత్రకు అందని త్యాగాల సమాహారం. భారతదేశం అణ్వస్త్ర దేశమైనప్పటికీ, మొదటగా తాను ఏ దేశంపైనా అణ్వస్త్రాలను ప్రయోగించబోనని భారత్ స్వీయ నియంత్రణ విధించుకుంది. సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ అడుగడుగునా భారత్ భద్రతకు ముప్పుగా మారిన పాకిస్థాన్‌తో ఎన్నో శాంతి ఒప్పందాలు కుదుర్చుకుంది. పాక్ పాలకులు అన్ని ఒప్పందాలను కాలరాస్తూ భారత్‌ను ఇబ్బందులకు గురిచేశారు. జిహాద్ పేరుతో ఉగ్రవాదులను తయారుచేసి ప్రజల ధన, మాన ప్రాణాలతో చెలగాటమాడిన పాక్ ప్రస్తుతం తీవ్ర ఆర్థికమాంద్యానికి గురై ఆకలితో అలమటిస్తున్నది. పాక్‌ను భారత్‌లో విలీనం చేయాలనే డిమాండ్ ఆ దేశ ప్రజల నుండే వ్యక్తంకావడం విశేషం. ఇంత జరుగుతున్నా భారత్‌తో పాక్ శతృత్వం కొనసాగించడం దురదృష్టకరం. ఇకనైనా ఐక్యరాజ్యసమితిని బలోపేతం చేయాలి. ఐక్యరాజ్యసమితి వైఫల్యం వలన మరో అంతర్జాతీయ సంస్థ ఆవిర్భవించే పరిస్థితులను కొట్టిపారేయలేం. అగ్రరాజ్యాలకు పాదాక్రాంతమయితే ఐక్యరాజ్యసమితి మనుగడ సాధ్యం కాదు. ఐ.రా.స తన మనుగడ కోసం నిధుల కోసం, విధులు మరచి, అగ్రదేశాలకు జేబు సంస్థగా మారితే ఎదురయ్యే పరిణామాలు ఊహాతీతం. •

# జీవ ఇంధనంతోనే జీవుల మనుగడ సాధ్యం!

డి.జె.మోహన్ రావు

మానవాళి అంతా తమ స్వార్థ ప్రయోజనాలను కొంత మేర తగ్గించుకొని సహజ వనరుల పట్ల, సహజ వాతావరణం పట్ల తగిన శ్రద్ధ చూపించాలి. అలాగే నేటి భావితరాల జీవన ప్రమాణాన్ని పెంచడానికి, సహజ వనరులను సంరక్షించడానికి సరైన పర్యావరణ సూత్రాలు అనుసరించి చక్కటి ప్రణాళికలు రూపొందించాల్సిన అవసరం ఉంది. వాహనాల్లో ఇంధనంగా పెట్రోల్ లేదా డీజిల్‌ను, విద్యుత్ తయారీలో బొగ్గులేదా అణుశక్తిని వాడుతున్నాం. ఇవన్నీ పరిమితమైన వనరులు మాత్రమేగాక వాతావరణ కాలుష్య కారకాలు కూడాను. అందువల్ల వీటికి ప్రత్యామ్నాయం జీవ ఇంధనాలు వాడవచ్చు. మనం నివసిస్తున్న ఈ భూమి మీద కాలుష్యాన్ని తగ్గించడానికి స్థిరమైన అభివృద్ధి కోసం సంప్రదాయేతర ఇంధనాలు ఉపయోగపడతాయి. గాలి, నేల, సరస్సులు సముద్రాలు ఎడారులు, మంచు కొండలు, సూర్యుడు, నుండి వచ్చే వెలుతురు, వేడి ఖనిజాలు, శిలాజ ఇంధనాలు, కొండలు, పర్వతాలు, ప్రకృతిలో ఉన్న సహజ వనరులు. మానవుడు తెలిసి కొన్ని తప్పులు చేస్తున్నాడు. జీవవైవిధ్యాన్ని దెబ్బతీయడం, పరిమితికి మించి భూ జలాలను తోడేయడం, అవసరానికి మించి ఖనిజాల కొరకు, బొగ్గు కొరకు, వజ్రాల కొరకు, వివిధ రకాల గనుల కొరకు, పెట్రోలియం కొరకు, భూమిని తవ్వడం, కొండలను పేల్చడం, వంటి పనులు చేస్తున్నాడు. వాటి వలన నేల, వాయు కాలుష్యాలు ఏర్పడుతున్నాయి. ఇంకా అటవీ నిర్మూలన, వంటి కార్యకలాపాలను విచక్షణారహితంగా వాడేస్తున్నాడు. వీటి వలన మనం ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్నాం. సాంప్రదాయ శిలాజ ఇంధనాలకు ప్రత్యామ్నాయంగా సాంప్ర



దాయేతర ఇంధన వనరుల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలి. 2018లో స్వచ్ఛ భారత్ మిషన్ కింద గోబార్ పథకం ప్రారంభించబడింది. వ్యాపార వెంచర్ల అభివృద్ధికి పర్యావరణాన్ని పెంపొందించడం, 2జి ఇథనాల్‌లో పరిశోధన, అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లే లక్ష్యంతో ప్రధాన మంత్రి జీవన్ యోజన 2019, ఉపయోగించిన వంట నూనెను సేకరించి బయోడీజిల్‌గా మార్చే పర్యావరణ వ్యవస్థను రూపొందించడానికి భారత ఆహార భద్రత, ప్రమాణాల అథారిటీ ద్వారా రీపర్పస్ యూజ్డ్‌కుకింగ్ ఆయిల్ కార్యక్రమం ప్రారంభించబడింది. బయో ఇథనాల్‌ను ఉత్పత్తి చేయడానికి మిగులు ఆహార ధాన్యాలు, బయోమాస్‌ను ఉపయోగించుకోవడానికి కూడాప్రభుత్వం అనుమతించింది. ఇంకా 2013-14 ఇథనాల్ సరఫరా సంవత్సరంలో భారతదేశం ఇథనాల్ సామర్థ్యం 1.53 శాతం నుండి 2020-21లో 7.93 శాతానికి పెరిగినట్లు నివేదించబడింది. 2013-14లో 38 కోట్ల లీటర్లు ఉన్న ఇథనాల్ సరఫరా 2020-21లో 322 కోట్ల లీటర్లకు పెరిగింది. అదే విధంగా ఇథనాల్ బ్లెండింగ్ శాతం కూడా 2013-14లో 1.53 శాతం నుంచి 2020-21లో 8.50శాతానికి పెరుగుతుందనిఅంచనా. డిమాండ్ పెరుగుదల కారణంగా ఇథనాల్ స్వేదనం సామర్థ్యం కూడా 215కోట్లలీటర్ల నుండి యేటా 427కోట్ల లీటర్లకు రెట్టింపయింది. ప్రభుత్వం జూన్ 2018లో జీవ ఇంధనాలపై జాతీయ విధానాన్ని ఆమోదించింది. 2018 ఈ పాలసీ లక్ష్యం 2030 నాటికి 20 శాతం ఇథనాల్ బ్లెండింగ్, ఐదుశాతం బయోడీజిల్ బ్లెండింగ్‌కు చేరుకోవడం. ఇతర విషయాలతో పాటు ఈ విధానం ఇథనాల్ కోసం ఫీడ్‌స్టాక్ పరిధిని విస్తరిస్తుంది. జీవ ఇంధనాల రంగం పురోగతి కారణంగా ఈ విధానం మే2022లో సవరించబడింది. జీవ ఇంధనాన్ని వాడి జీవుల మనుగడకు సహరించాలి. •

# మడికి దిగుబడి పెరగాలంటే 'పెట్టుబడి' అవసరమే!

డాక్టర్ సంగని మల్లేశ్వర్

నూతన రాష్ట్రంలో వ్యవసాయరంగ ముఖచిత్రాన్నే మార్చేసిన పథకం రైతుబంధు. అప్పు చేస్తే తప్ప ప్రారంభించలేని తెలంగాణ సాగుబడి చరిత్రను తిరగరాసింది. ఇది రైతుల్లో ఆర్థిక ధీమాను పెంచింది. దాని ప్రభావం ఇవాలా రాష్ట్రంలో పెరుగుతున్న ధాన్యం ఉత్పత్తిలో కనబడుతున్నది. కాబట్టే రైతుబంధుకు విశేష ప్రశంసలు వచ్చాయి. రాష్ట్రంలోని 90శాతానికిపైగా అప్పుల ఊబిలో చిక్కుకున్న రైతాంగాన్ని ఆదుకోవాలని, రైతు తలెత్తుకొని సగర్వంగా చెప్పుకొని బతికే స్థితికి తెచ్చింది. ముమ్మాటికీ కెసిఆర్ ఆలోచనే. తెలంగాణ ఏర్పడే నాటికి రైతుల దైన్యాన్ని గమనించిన వారికి, రాష్ట్రంలో చోటు చేసుకుంటున్న మార్పులు కలా? నిజమా? అనే దిగ్భ్రమను కలిగిస్తున్నాయి. 1990 దశకం నుంచి దేశంలో వ్యవసాయం మరింత సంక్షోభంలో పడిపోయింది. నాటి నుంచి ఏపార్టీ అధికారంలో ఉన్నా రైతుల సమస్యలకు పరిష్కారం దొరకలేదు. స్థూలంగా వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సమస్యలతో, రైతులు అనుభవిస్తున్న క్లేశాన్ని దూరం చేయడానికి కెసిఆర్ అహరహరం తప్పించారనడంలో ఎలాంటి సందేహం అవసరం లేదు. రాష్ట్ర రైతులను సాగులో నిలబెట్టి ఆర్థిక భరోసా కల్పించిన రైతుబంధు రాష్ట్ర చరిత్రలో అద్భుతఘట్టం. వడ్డీ వ్యాపారులను ఆశ్రయించేది లేదు. పంటను కుదువ పెట్టుకునేది లేదు. సబ్బండ వర్గాలకు రైతుబంధు సాగు సంజీవిని అయింది. స్వాతంత్ర్యం వచ్చిననాటి నుంచి వ్యవసాయరంగం పట్ల పాలకులు శ్రద్ధ కనబరిస్తే రైతులు ఇలాంటి వ్యధను అనుభవించేవారు కాదు. రైతుల సంక్షేమం కోసం కెసిఆర్ చేపట్టిన పథకాన్ని రైతు భరోసా పేరుతో సిఎం రేవంత్ అమలు అసలైన రైతు సమాజం స్వాగతిస్తున్నది. దుబారా ఖర్చును కట్టడి చేసి నిజమైన రైతు కష్టార్జితం వృధా కాకుండా చేయాలని ఎదురుచూస్తుంది. ప్రతి యేటా పెట్టుబడి సాయం కింద ఇచ్చే 12వ రైతుబంధు ఎన్నికల కోడ్ కారణంగా అందలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు రైతుభరోసా స్కీమ్ కింద ఎకరాకు యేటా రూ.15 వేలు అందిస్తామని మేనిఫెస్టోలో కాంగ్రెస్ హామీ ఇచ్చి, విజయం సాధించింది. గత ప్రభుత్వంలో బీడు భూములు, భూస్వాములకు వందల కోట్లు దోచి పెట్టారని, వీటన్నింటిపై సమీక్షించిన తర్వాతే నిధులు విడుదల చేస్తామని గత కొంత కాలంగా చెప్పినప్పటికీ, ట్రెజరీలో నిధులు లేవని, ఇప్పటికిప్పుడు రైతు భరోసా అమలుకాదని దాని కోసం రూ.11వేల కోట్లు అవసరమవుతాయని వార్తలు వెలువడ్డాయి. నాలుగు రోజులు కూడా గడవకముందే అంతమొత్తం ఖజానాలో లేవని, రైతు భరోసా నిధులు ఇప్పట్లో విడుదల కావంటూ సోషల్ మీడియాలో ప్రచారం ఊపందుకుంది. రైతు భరోసా విధి, విధానాలు ఖరారు కానందునే ఆలస్యానికి కారణం అయితే, రైతులు ఇబ్బంది పడుతారని ఈ దఫా రైతులకు యధావిధిగా రైతుబంధు నిధులు ఎప్పుడెప్పుడు రిలీజ్ అవుతాయా అని ఎదురుచూస్తున్న రైతుల ఖాతాల్లో జమ చేయాలని సిఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రైతుభరోసా అమలు కావాలంటే మరింత సమయం పట్టే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. ఇచ్చేది ఐదెకరాలా? పదెకరాలా? స్పష్టత రావాల్సి ఉంది. అదేవిధంగా సిఎం రేవంత్ ఇచ్చినా హామీ ప్రకారం కౌలు రైతులను గుర్తించే విధానాన్ని సైతం ఖరారు చేయాల్సి ఉంది. ఏదిఏమైనా ఇన్నాళ్లు పెళ్ల కదిలించని భూస్వాముల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. రైతుభరోసా అమలులో పారదర్శకత ఉంటేవెంకి పెళ్లి సుబ్బిచావు కొచ్చినట్టేనని ఇన్నాళ్లు లక్షలాది రూపాయలు దండుకున్న బడా భూస్వాములు కుక్క పేరు మీద, నక్క పేరు మీద రాసే ప్రయత్నం ముమ్మరంగా సాగుతోంది. రాష్ట్రంలో కోటి 40 లక్షల ఎకరాల సాగుభూమి ఉన్నది. 70.54 లక్షల మంది రైతులు లబ్ధి పొందుతున్నారు. వీరిలో ఐదు ఎకరాలలోపు 50లక్షల రైతులు ఉన్నారు. 20 లక్షల మంది రైతులు ఐదు ఎకరాలకు పైగా ఉన్న వాళ్లే. ఇందులో వారసత్వంగా ఉన్న ధనికులు కొందరైతే, నడమంత్రపు భూస్వాములు, రాజకీయ నాయకులు కోట్లాది రూపాయలు లబ్ధి పొందుతున్నారు. రైతుబంధు రాష్ట్ర చరిత్రలో నూతన అధ్యాయం అందులో ఇసుమంతా అనుమానం లేదు. నేరుగా రైతుకు నగదు బదలీచేసే సాహసం మునుపెన్నడూ దేశంలో ఏ ప్రభుత్వం అమలు చేసిన చరిత్రలేదు. కలిసిరాని కాలాలతో సతమవుతూ కాడి-మేడి వదిలేయడానికి సిద్ధమైన రైతాంగానికి నేనున్నానని ధైర్యమిచ్చే ఆత్మబంధు ప్రయత్నమే రైతుబంధు. అమలుకోసం రాష్ట్రంలో ఉన్నభూముల వివరాలు మొత్తం 'ధరణి' తప్పుల తడకగా అభివర్ణించారు. రైతుబంధు అనేది ధనిక రైతులకు, భూస్వాములకు లాభం చేకూర్చడానికే తప్ప, అసలు వ్యవసాయం చేసి కష్టనష్టాలు అనుభవించే కౌలు రైతులకు దీనివల్ల రూపాయి కూడా లాభం లేదని విమర్శించారు. కానీ ప్రపంచ దేశాల్లో రైతుల అభివృద్ధి కోసం చేపట్టిన వినూత్న కార్యక్రమాల్లో ఐక్యరాజ్యసమితి ఎంపిక చేసిన 20 పథకాలలో రైతుబంధు ఒకటి. ఇప్పటికి 11 విడతల్లో మొత్తం రైతుబంధు పథకం ద్వారా 72,931కోట్ల రూపాయలు రైతులకు పెట్టుబడి సాయంగా అందించింది. ఎన్నికల ముందునాలుగు రోజులు ఆగండి. 15వేలు ఇస్తాం అంటూ పదేపదే చెప్పినప్పటికి, ఎన్ని ఎకరాలవరకు ఇవ్వాలనే దానికి తర్జన భర్జనతో ఈ దఫా 'రైతు భరోసా' జమకు నోచుకోలేదు. ఇంకా కౌలు రైతులను గుర్తించే విధానాన్ని సైతం ఖరారు చేయాల్సి ఉంది. అందుకే సిఎం రైతు భరోసా అమలుకు సాంకేతిక ఇబ్బందుల కారణంగా ఈ దఫా పెట్టుబడి సాయం పాత పద్ధతిలో అమలుకు ఆదేశించారు. వచ్చే ఖరీఫ్ సీజన్లో రైతు భరోసా అమలు అయితే భూస్వాములకు 'తడి' రాక 'మడి' ఎండినట్టేనని విశ్లేషకులు భావిస్తున్నారు. •

## ప్రజావాక్కు



### ఒత్తిడి లేని చదువులు కావాలి

చాలా రోజుల నుండి మనకి తెలుగు రాష్ట్రాలలో ఇంటర్ విద్యార్థులు బలవన్మరణానికి పాల్పడటం, మనందరం చూస్తూనే ఉన్నాం. విద్యకార్పొరేట్ స్థాయిలో పొందుతున్న విద్యార్థులే ఎక్కువగా బలవన్మరణానికి పాల్పడటం జరగటం గమనార్హం. హైదరాబాద్‌లో మేడిపల్లి ప్రాంతంలో ఒక ప్రైవేట్ కళాశాలలో చదివే అమ్మాయి తీవ్ర ఒత్తిడి స్థాయి తట్టుకోలేక, మానసిక ఒత్తిడి తట్టుకోలేక హాస్టల్ బాత్‌రూంలో చున్నీతో ఉరివేసుకొని చనిపోయింది. తల్లిదండ్రులు చిన్నప్పటి నుండేపిల్లల్ని కార్పొరేట్‌లెవల్లో చదివించాలనుకుంటారు. కానీ వాళ్లు ఎన్ని మార్కులు వస్తే అంతగొప్ప అనేవిధంగా తృప్తిపడుతుంటారు. కానీ చాలా వరకు పిల్లల్లో మానసిక ఒత్తిడిని గమనించరు. ట్యూషన్ పెట్టి మరీ చదివించే విధంగా చేస్తారు. అందులో తప్పు లేదు. కానీ ప్రాక్టికల్ చదువులు చదివించే విధంగా చేయకపోవడం గమనార్హం.

-కిరణ్ ఫిషర్, హైదరాబాద్

### నామినేటెడ్ పదవులు ఇవ్వాలి

తెలంగాణ రాష్ట్ర సాధనంలో భాగంగా జరిగిన అనేక రకాల పోరాటాలలో పాల్గొన్న ఉద్యమకారులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం త్వరలో నియమించబోయే నామినేటెడ్ పదవులలో మండలస్థాయి, జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి పదవులలో తెలంగాణ ఉద్యమకారులకు ఎస్సీ, ఎస్టీ బిసి వికలాంగులు విద్యావంతులకు నామినేటెడ్ పదవులలో తగిన ప్రాధాన్యత కల్పించాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్‌జిల్లా

### నిధులు కేటాయించాలి

తెలంగాణ రాష్ట్రంలో చాలాశాఖలు నిధులలేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. కనీసం కార్యాలయ నిర్వహణ కొరకు నిధులు కూడా లేవు. కొన్ని శాఖలలో స్టేషనరీ కొనుగోలు చేయడానికి సైతంనిధులు లేకపోవడం విస్మయానికి గురిచేస్తుంది. గతంలో ఒకవెలుగు వెలిగిన చాలాశాఖలు ప్రస్తుతం నిధుల లేమితోఉండటం బాధాకరం. నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్న శాఖలపై ప్రస్తుతంప్రభుత్వం పూర్తి స్థాయిలో దృష్టిపెట్టి, నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్న శాఖలకు అధిక నిధులు కేటాయించాలి. ఇలాంటి శాఖలకు ప్రభుత్వం పూర్వవైభవం తీసుకురావాలి.

-అరుణసాగర్, జోగులాంబ, గద్వాల

### అందరికి ప్రవేశం కల్పించాలి

భారతదేశం సంస్కృతి, సంప్రదాయాలకు ప్రపంచంలోనే ఒక ప్రత్యేక స్థానాన్ని కలిగిఉన్నది. భిన్నత్వంలో ఏకత్వం భారతదేశ విశిష్ట లక్షణం. రామాయణం, భారతం, భాగవతం కేవలం ఇతిహాసాలు, పుస్తకాలు ఎవరో రయితలు రాసిన పుస్తకాలుగా మాత్రమే భావించకుండా ఆ పాత్రలు సజీవంగా భారతదేశంలో ఉన్నాయి. ఆ పాత్రల ప్రభావం భారతీయులు వ్యక్తుల మీద అంత ఎక్కువగా ఉంటుంది. అయోధ్య సమస్యను పరిష్కరించి అయోధ్యలో రామాలయ నిర్మాణం ప్రధానమంత్రి మోడీ సంకల్పమని కచ్చితంగా చెప్పవచ్చు. ఇప్పుడు సమస్య ఏమిటంటే ఆ రామాలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆ ఆలయ కమిటీ నిర్వాహకులు కేవలం రామభక్తులకు మాత్రమే ప్రవేశం కల్పిస్తామని భారీ ప్రకటనలు సోషల్ మీడియాలో హల్చల్ చేయిస్తున్నారు. భక్తులకు అన్యమనసులకు ఆ ఆలయ ప్రవేశం ఉండదని అంటున్నారు.

-వీరగంట భాస్కర్‌రావు, బొబ్బిలి

### సమసమాజం ఇంకెన్నాళ్లకు?

దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75సంవత్సరాలు అయినప్పటికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో అసమానతలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. మనదేశంలో అత్యంత ధనవంతమైన ఒక శాతం జనాభా దగ్గర ముప్పైశాతం జాతీయ సంపద పోగుబడి ఉంది. అలాగే అత్యంత ధనవంతమైన 10 శాతం జనాభా దగ్గర 65శాతం దేశ సంపద ఉంది. దీనికి విరుద్ధంగా ఆర్థికంగా కింద ఉన్న 50 శాతం జనాభా కేవలం 13 శాతం జాతీయ ఆదాయానికి మాత్రమే ప్రాతినిధ్యం వహించడం ఏ విధమైన అభివృద్ధి నిదర్శనం? ప్రపంచంలో మనదేశంలో ఏ దేశంలో కూడా లేనన్ని సంక్షేమ పథకాలు రాశిపరంగా మనదేశంలో అమలు అవుతున్నాయి. కానీ అవి అవసరమైన వారికి చేరడం లేదు. మన రాజ్యాంగ పీఠికలో సమున్నత ఆదర్శమైన సామ్యవాదం సాకారం కావాలంటే ప్రభుత్వాలు ఇకనైనా చిత్తశుద్ధితో కృషి చేయాలి.

-శాగశ్రీనివాస్, చిన్నపెండ్యాల, జనగామ జిల్లా

### ప్రజాపాలన చేయాలి

తెలంగాణ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ముఖ్యమంత్రి రేవంత రెడ్డి ప్రజాపాలన చేయాలి. వారు ఇచ్చిన హామీలను కచ్చితంగా నెరవేర్చాలి. ప్రజారంజకంగా పాలన చేయాలి.

-సరికొండ రవిప్రకాశ్‌రాజు, సూర్యాపేటజిల్లా

**ఎడిట్ పేజీకి..**

ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిణామాలకు సంబంధించిన విశ్లేషణాత్మక వ్యాసాలు పంపగోరేవారు ఈ కింది ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు e-mail: editpage@vaartha.com

# జపాన్‌లో ఒకేరోజు 155 భూకంపాలు

**టోక్యో, జనవరి2:** జపాన్ భూకంపంలో కీలక విషయాలు వెల్లడవుతున్నాయి. ఒక్క సోమవారమే ఈ దేశంలో తీవ్రమైన 155 ప్రకంపనలు వచ్చినట్లు గుర్తించారు. రిక్టర్ స్కేల్‌పై వీటి తీవ్రత 3,7. 6 మధ్యలో నమోదైంది. మంగళవారం కూడా ఇక్కడ ఆరుసార్లు భూమి కంపించింది. మృతుల సంఖ్య వేగంగా పెరుగుతోంది. ఈ ఉదయం 13 వరకు ఉన్న ఈ సంఖ్య ప్రస్తుతం 24కు చేరిందని జపాన్ టైమ్స్ పత్రిక వెల్లడించింది. భవనాలు కూలడం, అగ్నిప్రమాదాల కారణంగానే అత్యధిక మంది ప్రాణాలు కోల్పోయినట్లు పేర్కొంది. ఇక నీగట, టొయామా, ఫుకూయ్, గిఫూ నగరాల్లో క్షతగాత్రులను గుర్తించారు. 45 వేల ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అటు భూకంపం కారణంగా నిన్న జారీ చేసిన సునామీ హెచ్చరికల తీవ్రతను తాజాగా తగ్గించారు. పర్యాటక ప్రదేశమైన వాజిమా నగరంలోని అసైచి వీధిలో భూకంపం కారణంగా భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రాంతం కేవలం 280 చదరపు మీటర్లల్లోనే ఉండటంతో అగ్నికీలలు వేగంగా వ్యాపించాయి. మంటల ధాటికి 200 భవనాలు కాలిపోయాయి. ఈ విషయాన్ని జపాన్ పబ్లిక్ బ్రాడ్‌కాస్టర్ ఎన్‌హెచ్‌కె వెల్లడించింది. ఈ నగరంలోనే ఇప్పటివరకు 14 మరణాలు నమోదయ్యాయి. కొన్ని భవనాలు ఇప్పటికీ మంటల్లోనే ఉన్నాయి. ఈ నగరంలో 6 తీవ్రతతో భూకంపం సంభవించింది. నగరానికి వచ్చే ప్రధాన రహదారులన్నీ బీటలు వారి వాహనాలు కదలడం అసాధ్యంగా మారాయి. ఇక సుజు ప్రాంతంలో 50కిపైగా భవనాలు కూలిపోయాయని అధికారులు ధృవీకరించారు. వీటిల్లో ఓ ప్రార్థనా మందిరం కూడా ఉంది. ఇక్కడి పోర్టునుసునామీ అలలు తాకడంతో చాలా పడవలు బోల్తాపడ్డాయి. షికా ప్రాంతంలో సోమవారం అత్యధికంగా 7 తీవ్రతతో భూకంపం వచ్చింది. ఇక్కడ టోగి వైద్యశాల భవనం ధ్వంసమైంది. చాలా ఇళ్లు కూలిపోయాయి. హిమి ప్రాం తంలో అత్యధికంగా కర్రలతో నిర్మించిన ఇళ్లు ఉంటాయి. తాజాగా వచ్చిన భూకంపంలో ఇవి చాలా వరకు దెబ్బతిన్నాయి. జపాన్‌లో మంగళవా రం కూడా భూప్రకంపనలు ఆగకపోవడం సహా యక చర్యలకు పెద్ద అడ్డంకిగా మారింది. అసలు ప్రాణనష్టం ఎంతో తెలుసుకోవడం ఇప్పుడు జపాన్ ముందున్న ప్రధాన సమస్య. వేల సంఖ్యలో జపాన్ సెల్ఫ్ డిఫెన్స్ ఫోర్స్, ఫైర్ ఫైటర్లు, పోలీసులను భూకంప ప్రభావిత ప్రాంతాలకు తరలించారు. దారుణంగా దెబ్బతిన్న ప్రధాన రహదారుల కారణంగా సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోంది. ఈ ప్రాంతంలో ఉన్న ఏకైక ఎయిర్‌పోర్టులోని రన్‌వే భారీ పగుళ్లు ఏర్పడడంతో మూసివేయాల్సి వచ్చింది. ఇప్పుడు కాలంతో పోటీపడుతూ గాలింపు, సహాయకచర్యలు చేస్తున్నామని జపాన్ ప్రధాని కిషిద స్వయంగా వెల్లడించారు. ముఖ్యంగా భూకంప ప్రభావిత నోటో ద్వీపకల్పానికి సహాయక బృందాలు చేరడం ప్రధాన సమస్యగా మారిందని ఆయన వెల్లడించారు. సాధారణంగా భూకంపం నేరుగా మనిషి ప్రాణం తీయదు. కేవలం కూలిన భవనాలతోనే ప్రాణనష్టం ఉంటుంది. గత చరిత్రను పరిశీలిస్తే భూకంపాలు వచ్చిన సమయంలో 90 శాతం మందిని తొలి మూడు రోజుల్లోనే రక్షించగలిగినట్లు గణాంకాలు చెబుతున్నాయని యూనివర్సిటీ కాలేజి లండన్‌కు చెందిన డిజాస్టర్ అండ్ హెల్త్ విభాగ ప్రొఫెసర్ ఇలాన్ కెల్మన్ చెబుతున్నారు. దీనికి తోడు వాతావరణం, సహాయక బృందాలు ఎంత వేగంగా చేరుకొన్నాయి. పరికరాలు ఎంత తొందరగా అందుబాటులోకి వచ్చాయి అనేది కీలకం. భూకంపం వచ్చిన తొలి 24 గంటల్లో స్థానికులు చేతులు, చిన్న చిన్న పరికరాలతో చేపట్టే సహాయక చర్యలు అత్యంత కీలకం. వీరే అత్యధిక మందిని కాపాడుతుంటారు. జపాన్‌లో భూకంపం వచ్చి 24 గంటలు ఇప్పటికే గడిచిపోయాయి. కూలిన భవనాల శిథిలాల వద్ద సహాయక చర్యలు చేపట్టడం సవాళ్లతో కూడుకొన్నపని. మరోవైపు అర్థంతరంగా నిలిపివేసిన నాలుగు బుల్లెట్ రైళ్ల సేవలను జపాన్ పునరుద్ధరించింది. వీటి కారణంగా దాదాపు 1400 మంది చిక్కుకుపోయారు. ఈ రైళ్లు టోయమా స్టేషన్, కంజావా స్టేషన్ల మధ్య చిక్కుకున్నాయి.

## న్యూఇయర్ విషాదం, 24కు చేరిన మృతులు





### మణిపూర్‌లో మళ్లీ చెలరేగిన హింస

## పోలీసు కమాండోలపై మిలిటెంట్ల దాడి

**ఇంఫాల్, జనవరి 2:**ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో మరోసారి ఉద్రిక్తత నెలకొంది. మయన్మార్ సరిహద్దుల్లోని మోరే నగరంలో మిలిటెంట్లు రెచ్చిపోయారు. పోలీసు కమాండోలపై మెరుపుదాడి చేశారు. అప్రమత్తమైన భద్రతా బలగాలు ఎదురుకాల్పులు జరిపాయి. ఈ ఘటనలో నలుగురు పోలీసు కమాండోలు, ముగ్గురు బిఎస్ఎఫ్ జవాన్లు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను వెంటనే వాయు మార్గంలో ఇంఫాల్ ఆసుపత్రికి తరలించినట్లు అధికారులు తెలిపారు. వీరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. కాగా మణిపూర్‌లో సామాన్య పౌరులపై దుండగులు కాల్పులు జరిపిన మరుసటి రోజే, భద్రతాదళాలపై మిలిటెంట్లు దాడి చేయడం విశేషం. నూతన సంవత్సర వేడుకల వేళ థౌబాల్ జిల్లాలో హింసాత్మక ఘటన చోటు చేసుకున్న విష యం విదితమే. భద్రతా బలగాలను పోలిన దుస్తులు ధరించిన దుండగులు, పౌరులపై కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఆగ్రహించిన స్థానికులు వాహనాలను తగులబెట్టారు. దీంతో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకు న్నాయి. ఈ ఘటనలతో లోయ ప్రాంతాలైన థౌబాల్, ఇంఫాల్ తూర్పు, పశ్చిమ, కాక్చింగ్, బిష్ణుపూర్ జిల్లాలో ప్రభుత్వం కర్ఫ్యూ విధించింది. గతేడాది మణిపూర్‌లో హింసాత్మక ఘర్షణలు చోటు చేసుకున్న విషయం విదితమే.

దీంతో పలు జిల్లా ల్లో నెలల తరబడి ఆంక్షలు విధించాల్సి వచ్చింది. ఆ అల్లర్లు సద్దుమణిగి ఇప్పుడిప్పుడే శాంతియుత పరిస్థితులు నెలకొంటున్న వేళ, మరోసారి హిం సచెలరేగడం ఆందోళన కలిగిస్తోంది.



## వేలానికి దావూద్ చిన్ననాటి ఇల్లు!

**న్యూఢిల్లీ, జనవరి 2:** ముంబై బాంబే పేలుళ్ల సూత్రధారి, భారత మోస్ట్‌వాంటెడ్ ఉగ్రవాది దావూద్ ఇబ్రహీం చిన్ననాటి ఇంటిని వేలం వేయనున్నారు. దీంతో పాటు అతడి కుటుంబానికి చెందిన మరికొన్ని ఆస్తుల్ని కూడా ఈ వేలం ప్రక్రియలో ఉంచారు. మహారాష్ట్రలోని రత్నగిరిలోని ముంబాకే గ్రామంలో శుక్రవారం ఈ వేలం జరగనుందని ఎ`లు కథనాలు వెలువడ్డాయి. ఇప్పటికే దర్యాప్తు సంస్థలు ఈ ఆస్తులను స్వాధీనం చేసుకున్నాయి. వీటిని జనవరి 5న ముంబైలో వేలం వేయనున్నట్లు తెలిసింది. గత 9 యేళ్లలో దావూద్ కుటుంబానికి చెందిన రెస్టారెంట్, ఫ్లాట్స్, గెస్ట్ హౌస్ సహా 11 ఆస్తుల్ని వేలం వేసి సుమారు రూ.12 కోట్లు సమీకరించినట్లు కూడా ఆ కథనాల్లో వెల్లడయ్యాయి. దావూద్ ఇబ్రహీం 1980ల్లోనే పాకిస్థాన్‌కు పారిపోయాడు. 1993లో జరిగిన ముంబై వరుస పేలుళ్ల ప్రధాన సూత్రధారి. అమెరికాతోపాటు, ఐక్యరాజ్యసమితి కూడా అతడిని అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించింది. ఐక్యరాజ్యసమితి జాబితాలో అతడి చిరునామా కరాచీలో ఉన్నట్లు పేర్కొంది. అయితే అతడు తమ దేశంలో తలదాచుకున్న విషయాన్ని చెప్పడానికి పాక్ వెనకాడుతూనే ఉంది. ఎఫ్ఎటిఎఫ్ గ్రే లిస్టు నుంచి బయటపడేందుకుగాను తప్పని పరిస్థితుల్లో 2020లో ఒకసారి మాత్రం అంగీకరించినట్లు తెలిసింది. ఇటీవల దావూద్ చనిపోయాడనే వార్తలు వినిపించాయి. ఈ అంతర్జాతీయ ఉగ్రవాదిపై విషప్రయోగం జరిగిందని, కరాచీలో ఓ ఆసుపత్రిలో చేరాడని కథనాలు వెలువడ్డాయి. అయితే వీటిపై ఎలాంటి ధ్రువీకరణ లేదు.

## ‘హిట్-అండ్-రన్’ రూల్ ఏమిటి ? డ్రైవర్లకు ఎందుకింత ఆందోళన?



**న్యూఢిల్లీ, జనవరి 2:** భారత న్యాయ సంహిత చట్టంలో ‘హిట్ అండ్ రన్ ’కేసులకు సంబంధించి తీసుకొచ్చిన కఠిన నిబంధనను వ్యతిరేకిస్తోన్న ట్రక్కు డ్రైవర్లు దేశవ్యాప్త ఆందోళనకు దిగారు. న్యాయ శిక్షాస్మృతుల్లో గణనీయమైన మార్పులతో కేంద్ర ప్రభుత్వం ఇటీవల కొత్తచట్టాలను తీసుకువచ్చిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా భారతీయ న్యాయ సంహిత చట్టంలో ‘హిట్ అండ్ రన్’ కేసులకు సబంధించి తీసుకొచ్చిన కఠిన నిబంధన ట్రక్కుడ్రైవర్ల ఆగ్రహానికి కారణమయ్యింది. త్వరలో అమల్లోకి రానున్న ఈ చట్టానికి వ్యతిరేకంగా మూడు రోజుల పాటు దేశవ్యాప్త నిరసనకు పిలుపు నిచ్చారు. దీంతో దేశంలోని అనేక నగరాల్లో భారీ ట్రాఫిక్ జామ్‌లు, పెట్రోల్ బంకుల వద్ద క్యూ లైన్లు, హింసాత్మక ఘటనలు,లాఠీఛార్జీలకు దారి తీశాయి. ఈ నేపథ్యంలో డ్రైవర్లను ఆందోళనకు గురిచేస్తోన్న ఈ ‘హిట్-అండ్ -రన్ట్ నిబంధనను ఓసారి పరిశీలిస్తే..భారతీయ న్యాయ సంహిత ప్రకారం ‘హిట్ అండ్-రన్. ర్యాష్ డ్రైవింగ్ అనేవి నిర్లక్ష్య పూరిత డ్రైవింగ్ కిందకు వస్తాయి. ఇందుకులోని సెక్షన్ 104లో రెండు నిబంధనలు ఉన్నాయి. నిర్లక్ష్యంగా వాహనం నడిపి వ్యక్తి మరణానికి కారణమైతే గరిష్ఠంగా ఏడేళ్ల వరకు జైలు శిక్ష ఉంటుంది. దీంతో పాటు జరిమానా కూడా విధించే అవకాశం ఉందని మొదటి నిబంధనలో పేర్కొన్నారు. రెండో నిబంధనలో రోడ్డు ప్రమాదాలకు కారణమైన వాహన డ్రైవర్లు ఘటన గురించి పోలీసులకు లేదా మేజిస్ట్రేట్‌కు సమాచారం ఇవ్వాలి. అలా ఇవ్వకుండా అక్కడ నుంచి పారిపోతే గరిష్ఠంగా పదేళ్ల వరకు జైలు శిక్ష,రూ.7 లక్షల వరకు జరిమానా విధించే అవ కాశం ఉంటుంది.ప్రస్తుతం భారతీయ శిక్షాస్మృతిలో ఇవి సెక్షన్ 304 ఏ కిందకు వస్తాయి. నిర్లక్ష్యంగా వాహనం నడిపి, ప్రమాదంలో ఎవరైనా చనిపోతే ఐపీసీలో గరిష్ఠంగా రెండేళ్ల వరకు మాత్రమే జైలు శిక్ష ఉంది. హిట్ అండ్ రన్ కేసులో గరిష్ఠంగా పదేళ్ల జైలు శిక్ష, భారీ జరిమానా పైనే ట్రక్కులు, లారీలు, ప్రైవేటు బస్సుడ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక వేళ జైలు శిక్షపడితే పదేళ్లపాటు కుటుంబాలకు దూరంగా ఉండాల్సి వస్తుందని, తమ కుటుంబాలు రోడ్డున పడతాయిని ఆందోళన చెందుతున్నారు. ఈ నిబంధన వల్ల కొత్తవారు ఈ వృత్తిని చేపట్టేందుకు ముందుకు రారని డ్రైవర్ల సంఘాలు పేర్కొంటున్నాయి. అందుకే శిక్షతో పాటు జరి మానా కూడా తగ్గించాలని డిమాండ్ చేస్తున్నాయి. ‘హిట్ అండ్ రన్’ నిబంధనకు వ్యతిరేకంగా ట్రక్కుడ్రైవర్లు దేశవ్యాప్తంగా చేపట్టిన నిరసనలు ఉధృతంగా మారుతున్నాయి. పెద్ద సంఖ్యలో ట్రక్కులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. పలుచోట్ల ఈ ఆందోళనలు హింసాత్మకంగా మారాయి. ఆందోళనకారులు రహదారులను దిగ్బంధిం చడంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. ఇంధన ట్రక్కులు నిలిచిపోవడంతో చాలా నగరాల్లో పెట్రోల్ బంకులు మూతపడ్డాయి. మిగిలిన బంకుల వద్ద భారీ సంఖ్యలో వాహనదారుల క్యూకట్టిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఇలా దేశవ్యాప్తంగా కొనసాగుతోన్న డ్రైవర్ల ఆందోళన కారణంగా పెట్రోల్, డీజిల్ సరఫరాకు అంతరాయం ఏర్పడటంతో పలు రాష్ట్రాల్లో పెట్రోల్ బంకులు ఖాళీ వుతాయనే ఆందోళన నెలకొంది. ఈ ప్రభావం రోజువారీ ప్రయాణాలు, నిత్యవసర సరుకుల రవాణా,పాఠశాలలపైనా పడనున్నట్లు కన్పిస్తోంది.



## ట్రక్కు డ్రైవర్ల నిరసన.. పెట్రోల్ బంక్‌లకు పోటెత్తిన వాహనదారులు

**న్యూఢిల్లీ, జనవరి 2:** కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భారత న్యాయ సంహిత చట్టంలో హిట్ అండ్ రన్’ కేసులకు సంబంధించి తీసుకొచ్చిన కఠిన నిబంధనకు వ్యతిరేకంగా ట్రక్కు డ్రైవర్లు చేపట్టిన ఆందోళన మంగళవారం కూడా కొనసాగుతోంది. దేశంలోని వివిధ ప్రాంతాల్లో వీరు రాస్తారోకోలు, ర్యాలీలు చేపడుతున్నారు. అయితే డ్రైవర్ల నిరసనతో ఇంధన ట్రక్కులు నిలిచిపోయాయి. దీంతో ఇంధన కొరత ఏర్పడనుందన్న భయంతో పలు రాష్ట్రాల్లో వాహనదారులు పెట్రోల్ బంక్‌లకు పోటెత్తారు. మహారాష్ట్రలోని నాగ్‌పుర్‌లో సోమవారం రాత్రి నుంచి పెట్రోల్ బంక్‌లు కిటకిటలాడుతున్నాయి. హిమాచల్‌ప్రదేశ్, మధ్య ప్రదేశ్, జమ్మూకశ్మీర్, లఢఖ్‌లోనూ ఇదే పరిస్థితి కనిపించింది. కొన్ని చోట్ల అయితే బంకుల వద్ద వందల మీటర్ల వరకు వాహనాలు బారులుతీరాయి.

## విండ్‌ఫాల్ టాక్స్ టన్నుధరలు భారీగా పెంపు

### రూ.1300 నుంచి 2300గా నిర్ణయించిన కేంద్రం

**న్యూఢిల్లీ,జనవరి 2:** కేంద్రప్రభుత్వం ముడి చమురుపై విండ్‌ఫాల్ ట్యాక్స్‌ను మరింత పొడిగించింది. ఇప్పటివరకూ టన్నుక 1300గా ఉన్న ఈ పన్నును ఇకపై టన్ను ఒకింటికీ 2300 రూపాయలుగా నిర్ణయించింది. అదే సమయంలో ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ అంటే ఎటిఎఫ్‌ను మాత్రం మినహాయించింది. మొత్తం విండ్‌ఫాల్ ట్యాక్స్‌ను తొలగించింది. అలాగే డీజిల్‌పై లీటరుకు 0.5 చొప్పున ఉండే పన్నును తొలగించింది. అలాగే ఎటిఎఫ్‌పై లీటరుకు రూపాయి చొప్పున ఉండే ట్యాక్స్‌ను కూడా తొలగిస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. ముడిచమురు ఉత్పత్తిదారులు గత ఏడాదిజులైలో విండ్‌ఫాల్ ట్యాక్స్ విధించాలని నిర్ణయించారు. దీనివల్ల ఈ పన్ను గ్యాసోలిన్, డీజిల్, ఏవియేషన్ ఫ్యూయల్‌లపై విధించేందుకు వీలవుతుంది.ప్రైవేటు రిఫైనర్లు విదేశాల్లో తమ చమురు విక్రయించుకునేందుకు వీలవుతుంది. దేశీయంగా విక్రయాలకంటే విదేశాల్లో అమ్మకాలు జరిపితే భారీ మార్జిన్లు వస్తున్నాయి. అందుకే ఉత్పత్తిదారులు ఈనిర్ణయం తీసుకున్నారు.దేశీయ వినియోగాన్ని ప్రోత్సహించేందుకు వీలుగా కేంద్రం ఇపుడు విండ్‌ఫాల్ ట్యాక్స్‌ను ముడిచమురుపై పెంచి ఎటిఎఫ్‌పై తొలగించింది. డీజిల్‌పైనా ఈ పన్ను మినహాయింపు నిచ్చింది.

## విపక్ష ఎంపిల సస్పెన్షన్‌పై వచ్చేవారం హక్కుల కమిటీ విచారణ

**న్యూఢిల్లీ, జనవరి 2:** లోక్‌సభలో ముగ్గురు ఎంపిల సస్పెన్షన్‌పై చర్చించేందుకు సభాహక్కుల కమిటీ వచ్చేవారం సమావేశం అవుతోంది. పార్లమెంటు శీతాకాలసమావేశాల్లో ముగ్గురు కాంగ్రెస్ ఎంపిలు అనుచితంగా ప్రవర్తించారని వారిని సస్పెండ్‌చేసిన సంగతి తెలిసిందే. బిజెపి సభ్యుడు సునీల్‌కుమార్‌సింగ్ అధ్యక్షతన ఈనెల 12వ తేదీ జరిగే సమావేశంలో కాంగ్రెస్‌సభ్యులు కె.జయకుమార్, అబ్దుల్ ఖాలిక్, విజయకుమార్ విజయ్‌వసంత్‌ల మౌఖిక వాంగ్మూలం తీసుకుంటారని తేలింది. గతనెల 18వ తేదీ సభలో అనుచితంగా వ్యవహరించి నైతిక నియమావళిని ఉల్లంగించారని ముగ్గురినీ సస్పెండ్‌చేసిన సంగతి తెలిసిందే. పార్లమెంటు శీతాకాల సమావేశంల్లో మొత్తం 100 మంది విపక్ష సభ్యులను సస్పెండ్‌చేసిన సంగతి తెలిసిందే. సస్పెండ్ అయిన ముగ్గురుఎంపిలు సింగ్, ఖాలిక్, విజయకుమార్‌ల సస్పెన్షన్ విషయం ప్రిసైడింగ్ అధికారి నిర్ణయం ప్రకారం హక్కుల కమిటీకి నివేదించారు. కమిటీ నివేదిక ఇచ్చేంతవరకూ వారి సస్పెన్షన్ కొనసాగుతుంది. రాజ్యసభలో కూడా 46 మంది విపక్ష ఎంపిలను శీతాకాల సమావేశంలో సస్పెండ్ చేసారు. వారిలో 11మంది సభ్యుల సస్పెన్షన్‌ను రాజ్యసభ హక్కుల కమిటీకి నివేదించారు.

# కొత్తప్రపంచాన్ని సృష్టిస్తున్న యువత నైపుణ్యం

### భారతీదాసన్ వర్సిటీ స్నాతకోత్సవంలో ప్రధాని మోడీ



**తిరుచ్చిరాపల్లి,జనవరి 2:** భారతీయ యువత తమ నైపుణ్యాలతో కొత్తప్రపంచాన్ని సృష్టిస్తోందని ప్రధానిమోడీ అన్నారు. చంద్రయాన్ వంటి ప్రయోగాలతో మన శాస్త్రవేత్తలు భారత్ సత్తాను ప్రపంచానికి చాటారని ప్రశంసించారు. భారతీదాసన్ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో మోడీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. యువత ధైర్యవంతమైన సరికొత్త ప్రపంచాన్ని సృష్టించాలనే నినాదంతో భారతీదాస్ విశ్వవిద్యాలయాన్ని స్థాపించారు. ప్రస్తుతం దేశ యువత అదేపనిలో నిమ్నగం అయి ఉందని యువత అంటేనేశక్తికి నిదర్శనమని, నైపుణ్యంతో వేగంగాపనిచేయడం వారికున్న సామర్థ్యానికి నిదర్శనమన్నారు. దేశాభివృద్ధిని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లేందుకు యువతకు ఇది మంచి సమయం అన్నారు. మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా నైపుణ్యాలను పెంచుకుంటూ కొత్త అంశాలను ఆకళింపుచేసుకుంటూ ముందుకు సాగాలని యువతకు మోడీ సూచించారు. 2014లో భారత్ నాలుగువేల ఆవిష్కరణలకు పేటెంట్లు పొందితే ప్రస్తుతం ఆ సంఖ్య 50వేలకు చేరిందని ప్రధాని తెలిపారు. చంద్రయాన్ వంటిప్రయోగాలతో భారత శాస్త్రవేత్తలు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందారని, మును పెన్నడూ లేనివిధంగా శాస్త్రవేత్తలు భారత ప్రతిభను ప్రపంచానికి చాటిచెపుతున్నారని ప్రశంసించారు. భారతీయ కళాకారులు సంగీతకారులు ఎన్నో ప్రతిష్టాత్మక అంతర్జాతీయ అవార్డులను గెలుచుకున్నారని తెలిపారు. ఆ తర్వాత ప్రధాని మోడీ తిరుచ్చిరాపల్లిలో 20,140 కోట్ల విలువైన అభివృద్ధిపనులకు శంకుస్థాపన చేసారు. గత పదేళ్లలో విమానాశ్రయాలు, జాతీయరహదారుల సంఖ్యను రెట్టింపుచేసినట్లు ప్రధాని పేర్కొన్నారు.

### 2 లక్షల మంది మహిళలతో భారీ సభ ప్రసంగించనున్న ప్రధాని మోడీ

**తిరువనంతపురం,జనవరి 2:** రానున్న లోక్‌సభ ఎన్నికల సమరానికి ప్రధాని మోడీ సన్నద్ధమవుతున్నారు.బుధవారం ఆయన కేరళలోని త్రిసూర్‌లో మహిళలనుద్దేశించి ఏర్పాటు చేసిన భారీ బహిరంగసభలో ప్రసంగించనున్నారు. ఈ కార్యక్ర మానికి 2 లక్షల మంది వనితలు హాజరవుతారని అంచనా. ఈ కార్యక్రమంలో పార్లమెంటులో ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లు,మహిళా సంక్షేమం కోసం చేపడుతున్న పథకాలను ప్రధాని వివరించనున్నారు. బేజీపీ రాష్ట్రశాఖ తెక్కిం కాడు మైదానంలో అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు, పారిశ్రామి కవేత్తలు, కళాకారులు, సామాజిక సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు వివిధ రంగాల మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని బీజేపీ నేతలు చెప్పారు. కేరళలో వచ్చే ఎన్నికల్లో సత్తా చాటాలని బీజేపీ ప్రయత్నిస్తోంది. లోక్‌సభ ఎన్నికలకు ముందు మరికొంతమంది జాతీయ నేతలు కేరళలో పర్యటించి ప్రజలతో మమేకమవుతారని బీజేపీ రాష్ట్ర నాయకత్వం ఇటీవల తెలిపింది. మోడీ త్రిసూర్ పర్యటన మైలురాయిగా నిలుస్తుం దని ఆ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సురేంద్రన్ అన్నారు. రాష్ట్రంలో అధికార ఎల్‌డీఎఫ్, ప్రతిపక్ష యుడీఎఫ్ త్వరలో రాజకీయ పతనాన్ని చవిచూస్తాయని సురేంద్రన్ విమర్శించారు.



## యుపి సిఎం యోగిపై మహువా ఫైర్

**న్యూఢిల్లీ, జనవరి 2:** తృణమూల్‌కాంగ్రెస్‌పార్టీ నాయకురాలు మహువా మోయిత్రా యుపి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యయనాథ్‌పై విమర్శలు ఎక్కుపెట్టారు. యుపిలోని వారణాసిలో ఉన్న ఐఐటి బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన దోషులపై ఎందుకు బుల్డోజర్ చర్యలు తీసుకోవడంలేదని మహువా సూటిగా ప్రశ్నించారు. 2013 నవంబరు ఒకటవ తేదీ ఐఐటి బిహెచ్‌యులో ముగ్గురు వ్యక్తులు ఓ విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడానడరు. ఈ ఘటనలోని నిందితులు బిజెపి పార్టీ ఐటి సెల్‌కు చెందినవారని ప్రతిపక్షాలు మండిపడ్డాయి. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసాయి. వారిని ఆలస్యంగా అరెస్టుచేయడం వల్ల సాక్ష్యాలను తప్పుదోవ పట్టించే అవకాశం ఉందని దుయ్యబట్టారు.విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన నిందితులపై సీఎం యోగి బుల్డోజర్ చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు? ఈ ఘటన జరిగి రెండునెలలు గడిచిపోయిందని, వారంతా బిజెపి ఐటి సెల్‌కు చెందినవారే అంటూ ఆమె నిందితులు సీఎంయోగితో దిగిన ఫోటోలను ఎక్స్‌లోప్రశ్నించారు. అయితే లైంగిక వేధింపులకేసులో అరెస్టు అయిన ముగ్గురు నిందితులను పార్టీనుంచి బిజెపి బహిష్కరించింది. ఇక నిందితులను కునాల్ పాండే,ఆనంద్‌చౌహాన్, సాక్షం పటేల్‌గా పోలీసులు గుర్తించారు. ఆదివారమే పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని 14 రోజుల జ్యుడిషియల్ కస్టడీకి తరలించారు. కాగా విద్యార్థినిపై లైంగిక వేధింపుల`కసులో అరెస్టు అయిన నిందితులు బిజెపి సభ్యులని సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేష్‌యాదవ్ ఆరోపించారు.

## భద్రతాబలగాలపై దాడిలో విదేశీ కిరాయి సైనికుల హస్తం: సిఎం బీరేన్‌సింగ్



**ఇంఫాల్, జనవరి 2:** మణిపూర్‌లోని మోరోలో భద్రతా బలగాలపై జరిగిన దాడిలో మయన్మార్‌కు చెందిన విదేశీ కిరాయి సైనికుల హస్తం ఉందని అనుమానిస్తున్నట్లు సీఎం బీరెన్ సింగ్ తెలిపారు. మణిపూర్‌లో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మయన్మార్ సరిహద్దులోని మోరే నగరంలో భద్రతాబలగాలపై మిలిటెంట్లు మెరుపుదాడికి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో నలుగురు పోలీసు కమాండోలు, ఓబీఎస్ఎఫ్ జవాను తీవ్రంగా గాయపడ్డారు. ఇంఫాల్‌లో చికిత్స పొందుతున్న బాధితులను మణిపూర్ ముఖ్యమంత్రి ఎన్.బీరెన్ సింగ్ పరామర్శించారు. అనంతర ఆయన మాట్లాడుతూ ఈ దాడిలో మయన్మార్‌కు చెందిన విదేశీ కిరాయి సైనికులు పాల్గొన్నట్లు తెలుస్తోందన్నారు. వారు ఆధునిక ఆయుధాలను వాడినట్లు తెలిపారు. నిందితులను పట్టుకునేందుకు కూబింగ్ ముమ్మరం చేశాం. ఈ మేరకు అదనపు బలగాలను తరలించాం.ఈ దాడిలో మయన్మార్‌కు చెందిన విదేశీ కిరాయి సైనికుల ప్రమేయంపై అనుమానాలు ఉన్నాయి. ఇటువంటి ఉగ్ర కార్యకలాపాలను ఎదుర్కొనేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం అని చెప్పారు. మణిపూర్‌లో థౌబాల్ జిల్లాలో పౌరులపై దుండగులు కాల్పులు జరిపిన మరుసటి రోజు భద్రతా దళాలపై మిలిటెంట్లు దాడిచేయడం గమనార్హం. థౌబాల్‌లో నూతన సంవత్సర వేడుకల్లో హింసాత్మక ఘటన చోటు చేసుకుంది. భద్రతా బలగాలను పోలిన దుస్తులు ధరించిన దుండగులు పౌరులపై కాల్పులు జరిపారు. ఈ ఘటనలో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో వైపు మోరేలో డిసెంబర్ 30నుంచి భద్రతా బలగాల, మిలిటెంట్ల మధ్య కాల్పుల ఘటన చోటు చేసుకుంటున్నాయి.



## చత్తీస్‌గఢ్ నుంచి అయోధ్యకు సుగంధ భరిత బియ్యం, భారీగా కూరగాయలు

**రాయ్‌పూర్, జనవరి 2:**రాజధాని రాయ్‌పూర్‌లోని రామాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో చత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవసాయి పాల్గొని, ఆలయ ప్రాంగణం నుంచి 300 మెట్రిక్ టన్నుల సుగంధభరిత బియ్యంతో అయోధ్యకు బయలుదేరిన 11 ట్రక్కులకు పచ్చజెండా ఊపారు. ఇదిలా ఉండగా సిఎం విష్ణు దేవ్‌సాయి తన సోషల్ మీడియా ఖాతాలో రాముని దర్శనం కోసం ఆతృతగా ఎదురు చూస్తున్నాం. జనవరి 22న అయోధ్యలో మర్యాద పురుషోత్తముడైన శ్రీరామచంద్రుని విగ్రహాన్ని ప్రతిష్టించబోతున్నారు. రాష్ట్రంలోని రైతులు వారి పొలాల్లో పండించిన 100 టన్నుల కూరగాయలను అయోధ్యకు పంపాలని నిర్ణయించుకున్నారు. శ్రీరాముడు ప్రతి వ్యక్తి హృదయంలో ఉన్నాడు. ఈ మహత్కార్యంలో భాగస్వాములవుతున్న రాష్ట్రంలోని రైతులు అభినందనీయులు అని పేర్కొన్నారు. కాగా చత్తీస్‌గఢ్ రైస్‌మిల్లర్లు అయోధ్యకు సుగంధభరిత బియ్యం పంపినందుకు సిఎం వారికి కృతజ్ఞతలు తెలిపారు.

## రైలు ప్రమాదాల నివారణ చర్యలపై వివరాలు ఇవ్వండి: సుప్రీం

**న్యూఢిల్లీ, జనవరి 2:** ఆటోమేటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ సిస్టమ్ ‘కవచ్’తోపాటు రైల్వే ప్రమాదాల నివారణ తీసుకుంటున్న భద్రతా చర్యల గురించి తెలియజేయాలని భారత సర్వోన్నత న్యాయస్థానం ప్రభుత్వాన్ని ఆదేశించింది. రైల్వేలో ప్రమాదాలు నివారించడానికి ‘రైల్వే ప్రమాదాల రక్షణ’చర్యలు అమలు చేసేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ వివరాలను కోరింది. ఒడిశాలోని బాలేశ్వర్‌లో గతేడాది జూన్ లో జరిగిన ఘోర రైలు ప్రమాదంలో దాదాపు 290మంది ప్రాణాలు కోల్పోయారు.

ఈ నేపథ్యంలో రైల్వే తీసుకుం టున్న భద్రతా చర్యలు వెల్లడించాలని సుప్రీం కోర్టులో ఓ పిటిషన్ దాఖలు చేశారు. గత మూడు దశాబ్దాల్లో రైళ్ల ఢీకొట్టడంవల్ల జరిగిన అనేక ప్రమాదాలను న్యాయస్థానం దృష్టికి పిటిషన్ దారుడు తీసుకెళ్లారు. భద్రతా చర్యలను బలోపేతం చేయడంలో భారతీయ రైల్వే తాత్సారం చేస్తోందన్నారు. పిటిషన్ వాదనలు విన్న సుప్రీం ధర్మాసనం ప్రస్తుతం అమలు చేస్తున్న భద్రతా చర్యలపై వివరాలు తెలియజేయాలని కేంద్రప్రభుత్వాన్ని ఆదేశించింది. ఒకవేళ దేశవ్యా ప్తంగా కవచ్ అందుబాటులో ఉంచాలంటే ఆర్థిక ప్రభావం ఏమేరకు ఉంటుందనే విషయం కసరత్తు చేశారా? అని ప్రశ్నించింది.

భారతీయ రైల్వే ప్రమాదాల నివారణకు రైల్వే ప్రమాదాల రక్షణ’అమలు చేసేలా ప్రభుత్వానికి నిర్దిష్ట ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ విశాల్ తివారీ అనే వ్యక్తి సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిని జస్టిస్ సూర్యకాంత్,జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది.

రక్షణ చర్యల గురించి తెలియజేయాలని అటార్నీ జనరల్‌ను ఆదేశించింది. పిటిషన్ విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.



# అందరికీ సంతృప్తికరంగా వైకుంఠద్వార దర్శనం :టిటిడి ఇఒ ధర్మారెడ్డి

**తిరుమల,జనవరి 2ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలోపల మోక్షమార్గం వైకుంఠద్వారాన్ని పదిరోజులపాటు 6.47 లక్షల మంది భక్తులకు సంతృప్తికరంగా దర్శనం చేయించినట్లు టిటిడి ఇఒ ఎవి ధర్మారెడ్డి తెలిపారు. రాజ్యాంగహోదాలోని ప్రముఖులతోబాటు విఐపిలు, సామాన్యభక్తులకు చిన్నపాటి అసౌకర్యం కలగకుండా వారికి నిర్ధేశించిన సమయంలో ప్రశాంతంగా...తక్కువ సమయంలో వెంకన్న వైకుంఠద్వార దర్శనం కల్పించామన్నారు. డిసెంబర్ 23వతేదీ నుండి జనవరి 1వరకు పదిరోజులపాటు విఐపి బ్రేక్ దర్శనాలకు సంబంధించి 19,255 టిక్కెట్లు జారీచేయగా 18,578మంది భక్తులు హాజరయ్యారన్నారు. దాతలకు బ్రేక్ దర్శనాలకు సంబంధించి ఆన్‌లైన్‌లో 6,858టిక్కెట్లు బుక్ చేసుకున్నారని 6,388మంది దర్శనానికి వచ్చారన్నారు. శ్రీవాణి దాతలకు 20వేల ఎస్ఇడి టిక్కెట్లు జారీచేయగా 19,083మంది దర్శనం చేసుకున్నారన్నారు. 300 రూపాయలు ప్రత్యేక ప్రవేశ దర్శనాలకు సంబంధించి 2.25లక్షలటిక్కెట్లు ఆన్‌లైన్‌లో బుక్‌చేసుకున్న భక్తుల్లో 1,97,524 మంది భక్తులు తిరుమలకు వచ్చి వైకుంఠద్వారంలో స్వామివారిని దర్శించుకున్నారు. సర్వదర్శనం టైమ్‌స్లాట్ టోకెన్లు 4.23లక్షలు మంజూరుచేశారు. 3,24,102మంది హాజరయ్యారు. 90,850మంది సామాన్యభక్తులు పదిరోజులపాటు తిరుపతిలో ఉండలేక దర్శనానికి రాలేకపోయారనేది టిటిడి వర్గాల అంచనా. పదిరోజులపాటు వైకుంఠద్వార దర్శనాలకు సంబంధించి తిరుమల తిరుపతి దేవస్థానం కల్పించిన సౌకర్యాలు, ఆదాయం, భక్తుల దర్శనం వివరాలను మంగళవారం ఉదయం తిరుమల అన్నమయ్యభవనంలో తిరుమల శ్రీవారి ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, విఎస్ఒ నందకిశోర్, క్యాటరింగ్ ప్రత్యేకఅధికారి జిఎల్ఎన్ శాస్త్రితో కలసి ఇఒ ధర్మారెడ్డి మీడియాప్రతినిధులకు వెల్లడించారు. పదిరోజులు తిరుమలకు వచ్చి వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కుబడుల రూపంలో హుండీ కానుకలు ఆదాయం 40.20 కోట్లు చేకూరాయి. 17.81 లక్షల మంది అన్నప్రసాదాలు స్వీకరించారని, 35.60 లక్షల మంది లడ్డూ ప్రసాదాలు కొనుగోలు చేసుకున్నారు. 2.14 లక్షల మంది భక్తులు తలనీలాలు సమర్పించినట్లు గణాంకాలు రూపంలో ఇఒ తెలిపారు. పురాతన కట్టడాలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని, అదే సమయంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడాల్సిన బాధ్యత ఉందని టిటిడి ఇఒ ఎవి ధర్మారెడ్డి తెలిపారు. తిరుపతిలో అలిపిరి పాదాల మండపం వద్ద ఉన్న రాతిమంపం కూలిపోయే స్థితికి చేరుకుందని, దీని పునర్నిర్మాణానికి సంబంధించి భారత పురావస్తు శాఖకు పలుమార్లు లేఖలు రాసినా స్పందనలేదని చెప్పారు. మంటపం పున:నిర్మాణంపై టిటిడిపై రాజకీయాలు చేయడం బాధాకరమన్నారు. నందలూరులోని శ్రీ సౌమ్యనాథస్వామివారి ఆలయ గోడకూలిందని, దీనికి సంబంధించి పురావస్తు శాఖకు లేఖలు రాసినా స్పందించడం లేదని చెప్పారు. రాతిమండపాలు, ఆలయాల పునర్నిర్మాణానికి సంబంధించి టిటిడి ప్రత్యేకంగా ఆలయ నిర్మాణ విభాగం ఉందని, ఇక్కడ నిపుణులైన స్థపతులు ఉన్నారని వివరించారు. ఎస్వీ శిల్పకళాశాల ఆధ్వర్యంలో ఎంతోమంది నిపుణులు తయారవుతున్నారని వీళ్ళంతా విగ్రహాల తయారీతోపాటు, చక్కగా ఆలయాలు నిర్మించ గలరని ఇఒ వివరించారు. ఇటీవల జమ్ముకాశ్మీర్, వైజాగ్, హైదరాబాద్, ఒడిశా, కన్యాకుమారి, సీతంపేట, రంపచోడవరం ప్రాంత్రాల్లో అత్యంత సుందరంగా రాతి కట్టడంతో ఆలయాలు నిర్మించామని పేర్కొన్నారు. అలిపిరి నడక మార్గంలో ఏర్పాటుచేసిన ట్రాప్ కెమెరాల ద్వారా చిరుత, ఎలుగుబంటి సంచారాన్ని గుర్తించినపుడు వెంటనే భక్తులను అప్రమత్తం చేసి తగిన చర్యలు తీసుకుంటున్నామని ఇఒ ధర్మారెడ్డి వివరించారు. భక్తుల భద్రత దృష్ట్యా రాష్ట్ర అటవీశాఖకు 35 కోట్లు రూపాయలు అందించామని, దీంతో అత్యాధునిక ట్రాప్ కెమెరాల కొనుగోలుతోపాటు ఇతర చర్యలు చేపడతారని చెప్పారు.

# ప్రధాన మంత్రి జన్ మన్ కార్యక్రమంపై కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబ సమావేశం

**విజయవాడ, జనవరి2, ప్రభాతవార్త ప్రతినిధి:** దేశ వ్యాప్తంగా ఆదివాసీ, మారుమూల గిరిజన ప్రాంతాల ప్రజల సంక్షేమం కోసం త్వరలో అమలు చేయనున్న ప్రధాన మంత్రి జాన్ జాతి ఆదివాసి న్యాయం మహా అభియాన్ పథకం (పీయమ్ జేఏయన్‌యంఏయన్) అమలు చేస్తున్నారు. ఈ కార్యక్రమం అమలుపై మంగళవారం డిల్లీ నుండి కేబినేట్ కార్యదర్శి రాజీవ్ గౌబ వివిధ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో వీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన, ఆదివాసీల ప్రయోజనానికి ఉద్దేశించిన ఈ పథకాన్ని విజయవంతంగా అమలు చేయాలని కోరారు. కార్యక్రమానికి సంబంధించి ఆయన రాష్ట్రాలకు దిశదశ నిర్దేశించారు. వివిధ రాష్ట్రాలతో పాటుగా ఏపీలో ఈ పథకం అమలుకు సంబంధించి పలు సూచనలు చేసారు. అమలు ఏర్పాట్లు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ వీడియా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా కెఎస్ జవహార్ రెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు కె విజయానంద్, బి రాజశేఖర్, యం.టి.కృష్ణబాబు, గోపాల కృష్ణ ద్వివేది, ముఖ్య కార్యదర్శులు ప్రవీణ్ ప్రకాశ్, జి జయలక్ష్మి, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి కాంతిలాల్ దండే, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేషన కుమార్, డైరెక్టర్ ట్రైబల్ వెల్ఫేర్ డైరెక్టర్ జె మురళి తదితర అధికారులు పాల్గొన్నారు.



ధ్వజస్తంభం వద్ద మాట్లాడుతున్న బొజ్జల సుధీర్‌రెడ్డి

# సంప్రదాయాలకు తిలోదకాలు ఇష్టారీతిన నిర్ణయాలు

## శ్రీకాళహస్తీశ్వరాలయం వైఎస్సార్సీ రాజ్యమా?

**టిడిపి నేత బొజ్జల సుధీర్‌రెడ్డి**

**శ్రీకాళహస్తి,జనవరి 2 ప్రభాతవార్త** పవిత్ర మైన శ్రీకాళ హస్తీశ్వ రాల యాన్ని అధికార పార్టీ నాయ కులు ఇష్ట మెచ్చినట్లు వాడు కుంటూ సంప్రదాయాలకు తిలోదకాలిస్తున్నారని ఇష్ట మెచ్చినట్లు నిర్ణయాలు తీసుకుంటూ గందరగోళం సృష్టిస్తున్నారని మంగళవారం శ్రీకాళహస్తి తెలుగు దేశం నాయకుడు బొజ్జల సుధీర్‌రెడ్డి ధ్వజమెత్తారు. కాగా ఈ సంఘటనలపై సమగ్ర విచారణ జరపాలని అధికార బలం ఉందనే ధీమాతో శాసన సభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి ఆలయంలో చేస్తున్న పాపాలను ఖండిస్తున్నామని జాతీయ తెలుగుదేశం కార్యదర్శి నారాలోకేష్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో మృత్యుం జయస్వామి ఆలయానికి పక్కనే ఉన్న ఓగదిని తొలగించటాన్ని తెలుగుదేశం ఖండించింది. వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాళహస్తీశ్వరాలయంలో మృత్యుంజయస్వామి ఆలయం పక్కన పురాతన కాలం నాటి నుంచి ఓ గది ఉంది. దానిని స్టోర్స్‌గా ఉపయోగిస్తున్నారు. అయితే ఈ గదిని తొలగించటాన్ని తెలుగుదేశం తప్పు పట్టింది.

**ఆశీర్వచనాల కోసం సంప్రదాయాలకు తిలోదకాలివ్వాలా?**

శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే అతిధులకు 'ఆశీర్వచనాల కోసం' పురాతన కాలం నాటి కట్టడాలను కూల్చి వేటయం సబబా? అని తెలుగుదేశం నాయకుడు బొజ్జల సుధీర్‌రెడ్డి ప్రశ్నించారు. మంగళవారం ఆయన ఆలయంలోని మృత్యుంజయ ఆలయం పక్కన గల ఓ గదిని కూల్చివేయటం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసారు. 11 ఎకరాల ఆలయం విస్తీర్ణంలో ఇక్కడే కొట్టాలా? అని ప్రశ్నించారు. ఇలాంటి చర్యలు హిందువుల మనోభావాలను దెబ్బతీయటమే అవుతుందని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి చర్చిల మీద ప్రేమను తాము తప్పు పట్టడం లేదని కానీ హిందూవుల మనోభావాలను వారి ఆచారాలకు తిలోదకాలివ్వరాదని ధ్వజమెత్తారు. పంచభూత లింగాల్లో వాయు లింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన దివ్యక్షేత్రంలో రాజుల కాలంలో నిర్మించిన కట్టడాన్ని తొలగించటం సబబా? అని ప్రశ్నించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆగమశాస్త్ర నియమాలకు విరుద్దంగా అధికా రులు నిర్ణయా లు తీసుకోవటం దారుణ మన్నారు. అలా నిర్ణయం తీసుకున్న వారిపై చర్యలు తీసు కోవాలని సుధీర్‌రెడ్డి డిమాండ్ చేసారు. ఆలయంలో గత నాలుగుసంవత్సరాలుగా అక్రమార్కులకు అందలం ఎక్కించారు. అర్హత లేని వారికి అధికారం కట్టబెట్టి తమ పబ్బం గడుపుకోనుటకు శాసనసభ్యుడు పూనుకోవటం దారుణమన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని వివరించారు. నిర్మాణాల పేరుతో శివయ్య సొమ్మును స్వాహ చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో శ్రీకాళహస్తీశ్వ రాలయంలో పని చేయటానికి రెండేళ్ళుగా రెగ్యూలర్ అధికారే లేదా? అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమాల్లో ఆయనతో పాటు కంఠారమేష్, కామేష్‌యాదవ్, అశ్వద్ధామ, నెమళ్ళూరు బుజ్జి, సుబ్బయ్య, ధశరాధాచ్చారి, చక్రాల ఉష పాల్గొన్నారు. ఆలయాన్ని పాపా లకు నిలయంగా మార్చిన నాయకులు: నారాలోకేష్ శ్రీకాళ హస్తీశ్వరాలయాన్ని పాపా లకు నిలయంగా మార్చారని తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారాలోకేష్ ఓ ప్రకటనలో ధ్వజమెత్తారు. తాము తెలిసి తెలియక చేసిన పాపాలు పోవాలని, సన్మార్గంలో నడిచేలా దీవించాలని భక్తులు శ్రీకాళహస్తీశ్వరుని వేడుకుంటారని పేర్కొన్నారు. అధికారం తలకెక్కిన స్థానిక శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి శ్రీకాళ హస్తీశ్వరాల యంలోనే పాపాలకు పాల్పడుతున్నారని స్వామి అమ్మవార్లకే అపచారం తలపెడుతున్నారని ధ్వజమెత్తారు. పురాతన ఆలయం చారిత్రక కట్టడాలను కూల్చటానికి పూనుకోటం దారుణ మన్నారు. పురావస్తు దేవాదాయశాఖ నిబంధనలు పట్టించుకోకుండా విఐపీల ఆశీర్వాదాల కోసం శ్రీకాళహస్తీశ్వ రాలయంలో సంప్రదాయాలకు తిలోదకాలివ్వటం దారుణమన్నారు.

ఈ చర్యలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని నారాలోకేష్ డిమాండ్ చేసారు. అయితే ఈ కట్టడాలు పురాతనమైనవి కాదని ఇటుకరాయి కట్టడమని, రాష్ట్ర దేవాదాయశాఖ స్థపతి సూచనమేరకే నిర్ణయం తీసుకున్నట్లు మంగళవారం ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు వివరణ ఇచ్చారు.



జాతీయ స్థాయి టెన్నిస్‌టోర్నమెంట్‌కు సిద్ధమౌతున్న విక్రమ్ కోర్టు

# నేటి నుంచి శ్రీకాళహస్తిలో జాతీయస్థాయి టెన్నిస్ పోటీలు సిద్ధమౌతున్న విక్రమ్ టెన్నిస్ అకాడమీ కోర్టు

**శ్రీకాళహస్తి,జనవరి 2 ప్రభాతవార్త** తిరుపతిజిల్లా శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో నేటి నుంచి జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలకు విక్రమ్ ఆడిటోరియం సిద్ధమౌతుంది. క్రీడలు, క్రీడాకారులకు నిలయమైన శ్రీకాళహస్తిలో నాటి రాజులు ఏర్పాటు చేసిన రిపబ్లిక్ క్లబ్ సుమారు 35 సంవత్సరాల పాటు జాతీయ అంతర్జాతీయస్థాయిలో టెన్నిస్ పోటీలను నిర్వహించారు. నందన్‌బాల్ సోదరులు ఇక్కడ పోటీల్లో పాల్గొన్నారు. అలాంటి చరిత్ర కల్గిన పుణ్యక్షేత్రంలో టెన్నిస్ క్రీడల్లో ప్రవేశం, ఉత్సాహం ఉన్న డాక్టర్ చంద్రశేఖర్ విక్రమ్ టెన్నిస్ క్లబ్‌ను స్థాపించారు. కొన్ని సంవత్సరాలు రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించిన ఆయన గత ఏడాది జాతీయ స్థాయి పోటీలకు శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది అంతర్జాతీయస్థాయిలో పోటీలు నిర్వహించుటకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఈ మేరకు విక్రమ్ టెన్నిస్ కోర్టును సిద్దం చేస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం పోటీలను స్థానిక శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల ప్రారంభానికి తెలుగుదేశం నాయకుడు బొజ్జల సుదీర్‌రెడ్డి, శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, బిజెపి నాయకుడు కోలా ఆనంద్‌కుమార్, మాజీ శాసనసభ్యులు ఎస్‌సివి నాయుడు, సత్రవాడ మునిరామయ్య ఇతర నాయకులను ఆహ్వానించారు.

**300 మంది క్రీడాకారులకు ఆహ్వానం:** శ్రీకాళహస్తి విక్రమ్ టెన్నిస్ క్లబ్ బుధవారం నుంచి ప్రారంభించనున్న జాతీయ స్థాయి సీనియర్ల టెన్నిస్ టోర్నమెంట్‌కు సుమారు 300 మంది క్రీడాకారులు హాజరు కావచ్చునని ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం సాయంత్రానికి ఏర్పాట్లు పూర్తి చేసి ముస్తాబు చేసారు. ఈ నెల 3 నుంచి 9 వరకు ఏడు రో జుల పాటు నిర్వహించే పోటీలకు ఆరు కోర్టులను సిద్ధం చేసారు. అవసరమైతే రేయింబవళ్ళు నిర్వహించుటకు లైటింగ్‌కూడా సిద్ధం చేసారు. ఈ పోటీల్లో 35+,45+,65+,70+,75+ల వయస్సు కల్గిన వారికి పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వివరించారు. పోటీల్లో పాల్గొని గెలిచిన వారికి రూ.5లక్షల విలువ కల్గిన బహుమతులు అందించబడుతుందని రన్నర్స్ కూడా షీల్డులు ఇవ్వబడుతుందన్నారు. అలాగే పాల్గొన్న వారికి ధృవీకరణ పత్రాలను అందిస్తామన్నారు. ఇక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు బస వసతితో పాటు భోజన వసతులు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు వివరించారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిర్వాహకులు డాక్టర్ చంద్రశేఖర్, డివి వేణుగోపాల్, మన్మధరావు, ధనంజయులు డాక్టర్ చైతన్య, చంద్రశేఖర్, చంద్రరాజు పాల్గొన్నారు.

# సుబ్రమణ్యస్వామికి విశేష అలంకరణ



**శ్రీకాళహస్తి,జనవరి 2 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో అధ్యాత్మిక చింతన వెల్లి విరుస్తుంది. ధార్మిక దివ్యక్షేత్రంలో ప్రతి రోజూ ధార్మిక కార్యక్రమాలతో తులతూగుతుంది. స్థానిక భక్తులే కాకుండా దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు కూడా ఆధ్యాత్మిక చింతతనలో తన్మయత్వం పొందుతున్నారు. మంగళవారం సుబ్రమణ్యం స్వామి ఆలయాలు కిట కిటలాడాయి. అయితే భక్తుల తాకిడిని బట్టి ఆలయాధికారులు భక్తులు ఏ ఆలయం వద్ద అధికంగా ఉంటున్నారో అక్కడ సదుపాయాలు కల్పిస్తున్నారు. ఆలయంలో చెంగల్వరాయస్వామి ఆలయం వద్ద విశేష పూజలతో పాటు అలంకారాలు నిర్వహించారు. హారతి ఇవ్వటానికి ప్రత్యేక అర్చకుని ఏర్పాటు చేసారు. పట్టణానికి ఓ వైపు దుర్గంబా కొండ మరో వైపు సుబ్రమణ్యం స్వామి ఆలయం కుమారస్వామి తిప్పగా వెలసి భక్తుల కొంగుబంగారంగా విరాలజిల్లుతుంది. మంగళవారం పట్టణంలోని సుబ్రమణ్యం స్వామి ఆలయాలు భక్తులతో కిట కిట లాడుతున్నాయి. ఈ నేపధ్యంలో శ్రీకాళహస్తి పట్టణంలోని తేరువీధిలో వెలసిన షణ్ముఖ స్వామి ఆలయం అలాగే శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న కుమారస్వామి కొండపై వెలసిన సుబ్రమణ్యం స్వామి ఆలయం, శ్రీకాళహస్తీశ్వరాలయంలో రంగుల గోపురం పక్కన వెలసిన స్వామి, ఆలయంలోని చెంగల్వరాయస్వామి ఆలయంలో విశేషాభిషేకాలు నిర్వహించారు. ముఖ్యంగా తేరువీధిలో వెలసిన 'షణ్ముఖ స్వామి' ఆలయంలో స్వామికి షోడషాభిషేకాలు నిర్వహించారు. వందలాది లీటర్ల పాలు, పెరుగు, తేనే, విభూది, గంధం, కుంకుమ, పసుపు, సకల సుగంధ ద్రవ్యాలతో పూజలు అభిషేకాలు నిర్వహించారు. చూపరులను ఇట్టు ఆకట్టుకునే రీతిలో అర్చకులు ప్రసాద్, మురళిలు తీర్చి దిద్దుతున్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోనూ, ఆలయంలో పలు సుబ్రమణ్యం స్వామి ఆలయాలున్నాయి. అయితే తేరువీధిలో ఆలయప్రధానార్చకులు స్వర్గీయ బాబు గురుకుల్స్‌కు చెందిన ఆలయం షణ్ముఖ స్వామి ఆలయం. ఇక్కడ సుబ్రమణ్యం స్వామి ఆరుముఖాలతో వెలసి దర్శనమిస్తున్నారు. ఈ ఆలయం పట్టణ నడిబొడ్డులో ఉండటంతో ఇక్కడకు పట్టణ నలు మూలల నుంచి భక్తులు తండోపతండాలుగా కదలి వస్తున్నారు. భక్తులు ప్రతి ఒక్కరు పాలను, పెరుగును అందిస్తున్నారు. వాటితో అభిషేకాలు నిర్వహిస్తున్నారు. ఇక ఇక్కడ స్వాములు నిర్వహిస్తున్న అలంకారాలు ఇట్టే ఆకట్టుకుంటున్నాయి. ఇక భక్తులు వచ్చిన వారికి దాన ధర్మాలు చేస్తున్నారు. ఇక్కడ వెలసిన వినాయకుడు మహిమాన్వితుడని చెబుతారు. ఉదయం సూర్యోదయం నుంచి రాత్రి 9గంటల వరకు ఈ ఆలయంలో విశేష పూజలు, అలంకారాలు నిర్వహిస్తున్నారు. కాగా ఆలయంలోని రంగుల గోపురం పక్కనే వల్లిదేవసేన సమేత సుబ్రమణ్యం వెలసి భక్తుల కొంగుబంగారంగా వరాలిస్తున్నారు. ముఖ్యంగా ఇక్కడి ఆలయాల్లో కణితలు వచ్చిన వారు స్వామికి బెల్లం ముద్దలను నైవేద్యంగా పెట్టి పట్టణ నడిబొడ్డులోని నారద పుష్కరణిలో వేస్తున్నారు. కొన్ని వారాలకు వారికి నయం అవుతుందనే నమ్మకం ఉంది.

# నేడు రాష్ట్రస్థాయి పంచాయతీరాజ్ సదస్సు

## - ముఖ్యఅతిథిగా చంద్రబాబునాయుడు

**అమరావతి, జనవరి 2, ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రస్థాయి పంచాయతీరాజ్ సదస్సును ఈనెల 3వ తేదీన (బుధవారం) మంగళగిరిలోని సికె కన్వెన్షన్‌లోమధ్యాహ్నం 2 గంటలకు జరుగు తుందని రాష్ట్రంలోని అన్ని పార్టీలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు పాల్గొనాల్సిందిగా ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు వైవిబి రాజేంద్రప్రసాద్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వానపల్లి లక్ష్మీ ముత్యాలరావు పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ సర్పంచ్‌ల సంఘం, ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్‌ల ఆధ్వరనయంలో జరిగే పంచాయతీరాజ్ సదస్సుకు ముఖ్యఅతిథిగా మాజీ సిఎం చంద్రబాబునాయుడు హాజరుకానున్నారని తెలిపారు. ప్రభుత్వం సర్పంచ్‌ల నిధులు, అధికారాలను దొంగించి 3కోట్ల 50లక్షల గ్రామీణ ప్రజలకు అన్యాయం చేస్తోందని పేర్కొన్నారు. అందుకే రాజకీయాలకు అతీతంగా సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు ఐక్యమై 16 డిమాండ్ల సాధన కోసం భవిష్యత్ ఉద్యమ కార్యాచరణను ఈ రాష్ట్ర సదస్సులో రూపొందించటం జరుగుతుందని తెలిపారు.. ఈ సమావేశానికి రాష్ట్రంలోని 12,918 నరగామాల నుంచి రాజకీయాలకు అతీతంగా ప్రస్తుత, మాజీ సర్పంచ్‌లను, ఎంపిటిసిలను, జడ్పీటిసీలను, ఎంపిపిలను , జిల్లా పరిషత్ చైర్మన్‌లను, పట్టణాల్లో ప్రాతినిధ్యం వహిస్తున్న కౌన్సిలర్లను, కార్పొరేటర్లను ఆహ్వానించాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించటమైందని పేర్కొన్నారు.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావటానికి రాష్ట్ర పంచాయతీరాజ్ సదస్సుకు ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు నాయుడును రాష్ట్రకమిటీ ఆహ్వా నించటం జరిగిందని, వారు అంగీకరించి సదస్సు లో పాల్గొని మద్దతును ప్రకటిస్తామని చెప్పా రన్నారు. ఈ సదస్సును జయప్రదం చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొచ్చి మన హక్కులను సాధించుకోవటంలో భాగస్వాములు కావాలని కోరుతున్నామని ఎపి పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్రప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాప్‌రెడ్డి, ఎపి సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పగడాల రమేష్ కోరారు.

# ప్రయాణికుల రక్షణే ధ్యేయం: గుంతకల్లు రైల్వే ఎస్పీ కె.చౌడేశ్వరి

**గుంతకల్లు రైల్వే, జనవరి 2 ప్రభాతవార్త** దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజనల్‌ప్రధాన కేంద్రంలో నూతన సంవత్సర వేడుకలు ఉత్సాహభరితంగా వాతావరణంలో అట్టహాసంగా ఘనంగా జరిగాయి. ఆయా రైల్వే విభాగాలకు చెందిన సంబంధిత ఉన్నతాధికారులు, సిబ్బంది, కార్మిక సంఘాల, పెన్షనర్స్ అసోషియేషన్‌లు నాయకులు డిఆర్ఎం మనీష్ అగర్వాల్, రైల్వే గుంతకల్లు జిల్లా ఎస్పీ కె.చౌడేశ్వరి, అదనపు డిఆర్ఎంలు సూర్యనారాయణ, సుధాకర్లకు పూలమాలలు, పుష్పగుచ్చాలు పండ్లు, మిఠాయిలు అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రైల్వే ఎస్పీ చౌడేశ్వరి తమ కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. రైలు ప్రయాణీకులకు తగిన రక్షణ కల్పించే విధంగా నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. జి.ఆర్‌పి విభాగం, రైల్వే రక్షక దళం సిబ్బందితో సమన్వయంతో కలిసి పని చేయడం ద్వారా ప్రయాణికులకు పూర్తి స్థాయిలో రక్షణ కల్పించాలన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేందుఏకు మరో మూడు మాసాలు మాత్రమే ఉన్నందున రైల్వే బోర్డు నిర్దేశిత కాల వ్యవధిలో లక్ష్యాలను సాధించేందుకు నిబద్ధతతో కృసి చేయాలని కోరారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో రైల్వే అధికారులు డాక్టర్ ప్రభావతి గజలక్ష్మి, గంగరాజు, మనోజ్, శ్రావణ్‌కుమార్, సుదర్శన్‌రెడ్డి, వీరయ్య, అక్కిరెడ్డి, అనిల్‌కుమార్, మంగాచార్యులు, ఆర్.నాగేశ్వరరావు, జయశంకర్‌చౌహాన్, కుందా ప్రదీప్‌బాబు, టి.మురళీకృష్ణ, వైపి.సింగ్, అనిల్‌కుమార్, శీతల్‌బన్సల్, డిఎస్ఆర్‌పి షేక్ అబ్దుల్ అజీజ్, ఐఆర్‌పిలు నగేష్‌బాబు, సాయినాథ్, ఐపిఎఫ్ బేనయ్య, ఎస్ఐపిఎఫ్‌లు ఆనందప్ప, జయప్రకాష్‌రెడ్డి, లక్ష్మి తిరుమల, ఆయా విభాగాలకు చెందిన సంబంధిత అధికారులు, సీనియర్ సబార్డినేట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయానికి అంతర్జాతీయ ర్యాంక్



ర్యాంకింగ్ కోఆర్డినేటర్ డాక్టర్ రవిని సన్మానిస్తున్న విసి ప్రొఫెసర్ రాజశేఖర్

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, జనవరి 2,ప్రభాతవార్త:** యూనివర్సిటీ ఆఫ్ ఇండోనేషియా ఆధ్వర్యంలో ప్రకటించిన యూఐ గ్రీన్ మెట్రిక్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్ 2023లో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర్జాతీయంగా 298వ మరియు జాతీయంగా 10వ ర్యాంక్‌ని సొంతం చేసుకుంది. మౌలిక సదుపాయాలు, ఎనర్జీ, స్మార్ట్ భవనాలు, పునరుతా ్పదక శక్తి, వ్యర్థాల నిర్వాహన మరియు పునర్వినియోగం, నీటి పరిరక్షణ, రవాణా విద్య మరియు పరిశోధనాంశాలను పరిశీలించి ర్యాంక్‌లను విడుదల చేసింది. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి.రాజశేఖర్,

ర్యాంకింగ్స్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.రవిని అభినందించారు. కార్యక్రమంలో రెక్టార్ పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.కరుణ, ఐక్యూఏసి డైరెక్టర్ ప్రొఫెసర్ సంధ్య కోల్, ఐక్యూఏసి అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# దు:ఖం సాగరంలో ఎమ్మెల్యే పొన్నాడ కుటుంబ సభ్యులు

## - అమెరికా నుండి అమలాపురానికి మృతదేహాలు
## - ఓదార్చిన మంత్రులు వేణు, విశ్వరూప్

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, జనవరి 2, (ప్రభాతవార్త):** అమెరికా టెక్సాస్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన అమలాపురం వాసుల 5గురి మృతదేహాలను తీసుకువచ్చారు. టెక్సాస్ ట్రక్ ఢీకొని 5గురు దుర్మరణం పాలయ్యారు. వీరంతా ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ సతీష్ కుటుంబ సభ్యులు. చిన్నాన పొన్నాడ నాగేశ్వరరావు (68), చిన్నమ్మ సీతామహాలక్ష్మి (65), వారి కుమార్తె నవీన (38), మనువడు కృతిక్ (11), మనువరాలు నిషిద (9) అసువులు బాసారు. అమలాపురంలోని ఎమ్మెల్యే పొన్నాడ సతీష్ ఇంటికి మృతదేహాలు చేరడంతో దు:ఖ సాగరమైంది. పట్టణంలో విషాదం నెలకొంది. మృతదేహాలను చూసి కన్నీరు మున్నీరుగా కుటుంబ సభ్యులు, బంధువులు విలపిస్తున్నారు. మృతదేహాలను చూసి ఎమ్మెల్యే సతీష్ ఎక్కి ఎక్కి రోదించారు. వారందరినీ ఆపడం సాధ్యం కాలేదు. 5 రోజుల క్రితం జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కొల్పోయిన వీరిని రాష్ట్రప్రభుత్వం సహకారంతో 5 మృతదేహాలను అమలాపురం రప్పించారు. భౌతిక ఖాయం వద్ద రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖా మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస్ వేణుగోపాల కృష్ణ, రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పినిపే విశ్వరూప్, మాజీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు తదితరులు నివాళులు అర్పించి ఎమ్మెల్యే పొన్నాడను ఓదార్చారు. అనంతరం అంతిమ యాత్రలో పాల్గొన్నారు. పార్థివ దేహాలను ఇంటి నుంచి ఊరేగింపుగా రాజమహేంద్రవరం తరలించారు. అక్కడ కైలాస భూమిలో దహన సంస్కారాలు నిర్వహించారు. అమలాపురం, ముమ్మిడివరానికి చెందిన పలువురు నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# పింఛనుదారులు యాన్యువల్ వెరిఫికేషన్ సర్టిఫికెట్లు సమర్పించాలి

**విజయవాడ,జనవరి2,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వ పెన్షన్‌దారులు జీవన ప్రమాణ ప్రతాలను ఆయా జిల్లాలోని ఉప ఖజానా కార్యాలయాల పరిధిలో సమర్పించాలని ట్రెజరీ శాఖ ప్రకటించింది. పింఛన్ డ్రా చేయు పింఛనుదారులు లైఫ్ సర్టిఫికెట్ మరియు నాన్ ఎంప్లాయిమెంట్ సర్టిఫికెట్లు, ఫ్యామిలీ పింఛను డ్రా చేయు పింఛనుదారులు లైఫ్ సర్టిఫికెట్స్, నాన్ ఎంప్లాయిమెంట్ సర్టిఫికెట్లతో పాటు నాన్ రీ మ్యారేజ్ సర్టిఫికెట్లను జనవరి 1వ తేదీ నుంచి ఫిబ్రవరి 29లోగా సమర్పించాలని జిల్లా ఖజానా మరియు లెక్కల శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. పింఛనుదారులకు మెరుగైన వసతులు కల్పించాలన్న సంకల్పంతో ప్రభుత్వం డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ల స్వీకరణకు శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు. జిల్లా లోని ప్రతీ పింఛనుదారు ఈ విధానం ద్వారా తమ లైఫ్ సర్టిఫికెట్స్ సమర్పించవలసి ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం పింఛనుదారులు తమ నివాసిత ప్రాంతంలో అందుబాటులో ఉన్న మీ సేవా కేంద్రాలు, నెట్ సెంటర్‌లు మరియు పోస్టాఫీసులలో సంప్రదించి తమ తమ లైఫ్ సర్టిఫికెట్స్ సమర్పిచవచ్చునని తెలిపారు. లైఫ్ సర్టిఫికెట్స్ సమర్పణకు ఖజానా కార్యాలయాలను సంప్రదించే పింఛనుదారులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలియచేసారు. కనుకపైన తెలియజేసిన విషయాల దృష్ట్యా జిల్లాలోని పింఛనుదారులందరు ప్రభుత్వం నిర్ధేశించినకాల పరిమితిలోగా తమ లైఫ్ సర్టిఫికెటన్సను సమర్పించి వారి పెన్షన్ చెల్లింపులను క్రమబద్ధీకరించుకోవాలని సూచించారు.

# జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకు చివరి నాలుగు రోజుల సమయం మాత్రమే

## 6 జనవరి, 2024తో ముగియనున్న గడువు
## సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ తుమ్మా విజయ్ కుమార్ రెడ్డి

**విజయవాడ, జనవరి 2:** 6 జనవరి 2024తో గడువు ముగుస్తున్నందున అర్హులైన జర్నలిస్టులందరూ ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ శ్రీ తుమ్మా విజయ్ కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన జర్న లిస్టులందరికీ సంతృప్తస్థాయిలో ఇళ్ల స్థలం కేటాయించడానికి రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ఆయన పేర్కొన్నారు. జర్నలిస్టులు ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబర్ 535లో పేర్కొన్న నిబంధనలకు అనుగుణంగా ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న వారి దరఖాస్తులను, నిర్ధేశించిన వయస్సు, సరైన సమాచారం పొందుపరచని, మీడిమాలో పనిచేసిన అనుభవ పత్రాలు పొందుపరచని, మీడియాలో పనిచేసిన అనుభవ పత్రాలు పొందుపరచకపోవడం, సరైన అర్హతలు లేకపోవడం వంటి అంశాలకు సంబంధించిన అసంపూర్తిగా ఉన్న 935 మంది జర్నలిస్టుల దరఖాస్తులను సరిదిద్దుకునేందుకు మరో అవకాశం కల్పించామన్నారు. ఈ విసయమై ఇప్పటికే సంబంధిత జర్నలిస్టులకు సందేశాలు పంపడం జరిగిందన్నా వివరాలు సరిచేసుకున్న అనంతర సదరు జర్నలిస్టుల దరఖాస్తులను వెరిఫై చేసి కలెక్టర్లకు పంపిస్తామని పేర్కొన్నారు.

ఇప్పటికి 79 మంది జర్నలిస్టుల దరఖాస్తులు మాత్రమే ధృవీకరణ కోసం పెండింగ్‌లో ఉన్నాయని, వాటి వెరిఫికేషన్ ప్రక్రియను కూడా త్వరితగతిన పూర్తిచేస్తామని స్పష్టం చేశారు. జిల్లా ఇన్ చార్జ్ మంత్రి చైర్ పర్సన్‌గా, జిల్లా కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి, సబ్ కలెక్టర్ లేదా రెవెనూనయ డివిజనల్ అధికారి, డీఐపీఆర్వో, ముగ్గురు జర్నలిస్టులు సభ్యులుగా జిల్లా స్థాయి హౌసింగ్ కమిటీని రాష్ట్రంలోని 26 జిల్లాలకు ఏర్పాటు చేశామని కమిసనర్ విజయ్ కుమార్ రెడ్డి తెలిపారు.



జ్యోతిసురేఖను సత్కరిస్తున్న కలెక్టర్ తదితరులు

# దేశభవిష్యత్‌ను నిర్ణయించేది ఓటు

## : ఇసిఐ బ్రాండ్ అంబాసిడర్ జ్యోతిసురేఖ

**విజయవాడ(గన్నవరం), జనవరి 2, ప్రభాతవార్త :** దేశభవిష్యత్‌ను నిర్ణయించేది ఓటు మాత్రమేనని అర్జున అవార్డు గ్రహీత, భారత ఎన్నికల కమీషన్ బ్రాండ్ అంబాసిడర్ వెన్నం జ్యోతిసురేఖ పేర్కొన్నారు. ఓటు విలువను తెలుసుకుని ప్రతిఒక్కరూ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినయోగించుకోవాలని పిలుపునిచ్చారు. విజయవాడ కానూరులోని వెలగపూడి రామకృష్ణసిద్దార్థ ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో మంగళవారం ఉదయం ఓటర్లను జాగృతం చేసే స్వీప్(సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరైన జ్యోతిసురేఖ విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తూ 5సంవత్సరాలకు ఒకసారి జరిగే సార్వత్రిక ఎన్నికల్లో మంచి నాయకులను ఎన్నుకోవటం ద్వారా దేశం అభివృద్ధి చెందుతుందని, దాని ప్రభావం దేశంలోని అందరిపైనా ఉంటుందన్నారు. 18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని సూచించారు. ఒక్క ఓటుతో అభ్యర్థుల గెలుపుఓటములు తారుమారయ్యే అవకాశం ఉంది కనుక ప్రతిఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు. ఓటు ప్రాధాన్యతను అందరికీ తెలియచేయాల్సిన బాద్యత యువతపై ఉందన్నారు. తనను బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించిన ఎన్నికల కమీషన్‌కు ఈసందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాకలెక్టర్ పి.రాజబాబు మాట్లాడుతూ యువత తమ భవిష్యత్‌కోసం ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. ఓటు ఉంటేనే మంచి పౌరునిగా గుర్తించబడతారని, కళాశాల విద్యార్థుల్లో ఇప్పటికి 90శాతం మంది ఓటు నమోదు చేసుకున్నారని మిగిలిన 10శాతం మందికూడా ఓటు నమోదు చేసుకోవాలని కోరారు. ఈసందర్భంగా జ్యోతిసురేఖను శాలువాతో సత్కరించారు. ఈకార్యక్రమంలో కళాశాల డీన్ పాండురంగారావు, పెనమలూరు ఈఆర్వో డి.రాజు, తాహసీల్దార్ శివయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవి.రత్నప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, జనవరి 2, (ప్రభాతవార్త):** తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం బందపురం సమీపంలో 16వ నెంబరు జాతీయ రహదారిపై మంగళవారం మద్యాహ్నం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదానికి సంబంధించిన వివరాలను దేవరపల్లి సిఐ అనసూరి శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. నందిగామ నుండి విశాఖపట్నం వెళ్తున్న కారు అతివేగంగా డివైడర్ ఢీకొనడంతో డివైడర్‌ను దాటుకుని వెళ్లి అవతల వైపు వైజాగ్ నుండి హైదరబాద్ వెళ్తున్న కారును బలంగా ఢీకొనడంతో ప్రమాదం జరిగిందని తెలిపారు. విశాఖపట్నం నుండి హైదరబాద్ వెళ్తున్న కారులో ప్రయాణిస్తున్న ఏడుగురిలో హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు మహిళలతో పాటు 19 నెలల చిన్నారి మృతి చెందింది. మృతులు దివ్యప్రియ (25), రమాదేవి (50), గనిష్క (19) నెలలు మిగిలిన నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. అదేవిధంగా నందిగామ నుండి వైజాగ్ కారులో వెళ్తున్న వేల్పుల విజయ్ మోహన్, అమృత, శ్రీ సజనీ, గ్రేస్ రోవిన్‌లకు తీవ్రంగా గాయాలు అయ్యాయి. వీరిని వైద్య చికిత్స నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం నిమిత్తం రాజమండ్రి ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ శ్రీనివాసరావు తెలిపారు. అదే సమయంలో గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు గౌరీపట్నంలో జగనన్న సురక్ష కార్యక్రమం ముగించుకుని హైవే మార్గంలో నల్లజర్ల వెళ్తుండగా ఘోర ప్రమాదానికి గురైన బాధితులకు అండగా నిలిచి ప్రమాదంలో తీవ్ర గాయాలతో ఉన్న వారిని తరలించడానికి అధికారులకు అంబులెన్స్‌కు విషయాన్ని తెలియజేశారు.

# వైఎస్సార్సీ రెండో జాబితాలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఐదుగురుకి చోటు

- రెండు ఎంపి స్థానాలు, మూడు అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థుల ఖరారు
- ఇన్‌చార్జ్‌లను ప్రకటించిన మంత్రి బొత్స సత్యనారాయణ

**అనంతపురం, జనవరి 2 ప్రభాతవార్త బ్యూరో** రాబోయే లోక్ సభ, శాసనసభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అభ్యర్థుల ఎంపికలో భాగంగా ముందస్తుగా ఆయా నియోజకవర్గాలకు వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు గురువారం సాయంత్రం ప్రకటించింది. రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ, రాష్ట్రప్రభుత్వ సలహాదారులడు సజ్జల రామకృష్ణారెడ్డి ఈమేరకు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ల జాబితాను అధికారికంగా ప్రకటించారు. రాబోయే ఎన్నికల్లో వీరు అభ్యర్థులుగా వైసీపీ తరపున బరిలో ఉంటారు. వైసీపీ అధికారికంగా ప్రకటించిన జాబితాలో ఉమ్మడి అనంతపురం జిల్లాకు సంబంధించి కింది పేర్లు ఉన్నాయి. వైసీపీ తరపున అనంతపురం ఎంపి స్థానానికి కురుబ సామాజిక వర్గానికి చెందిన మాలగుండ్ల శంకర్‌నారాయణ (పెనుకొండ ఎమ్మెల్యే), హిందూపురం ఎంపి స్థానానికి వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన జె.శాంతి (బళ్లారి మాజీ ఎంపి), కదిరి అసెంబ్లీ నియోజకవర్గంకు ముస్లిం మైనార్టీ సామాజిక వర్గానికి చెందిన మక్బుల్ అహ్మద్‌ను, పెనుకొండ శాసనసభ నియోజకవర్గంకు కురుబ సామాజిక వర్గానికి చెందిన ఉషాశ్రీ చరణ్ (ప్రస్తుత మంత్రి), కళ్యాణదుర్గం అసెంబ్లీ స్థానానికి తలారి రంగయ్య (అనంతపురం ఎంపి), వైసీపీ ఇన్‌చార్జ్‌గా ప్రకటించారు.



న్యాయవాదుల దీక్షకు సంఘీభావం తెలుపుతున్న నాదెండ్ల, ఆలపాటి

# అనాలోచిత చట్టాలను తిప్పికొడదాం

## నాదెండ్ల మనోహార్, ఆలపాటి రాజా

**తెనాలి, డిసెంబర్ 2, ప్రభాత వార్త :** ప్రజాస్వామ్య భారతదేశంలో రాజ్యాంగం అందించిన చట్టాలను సైతం తుంగలో తొక్కి ఇష్టానుసారంగా తమ అవసరాల కోసం తీసుకువస్తున్న అనాలోచిత చట్టాలను రద్దు చేసే వరకు సంఘటితమై పోరాడాల్సిన ఆవశ్యకత ఉందని ఈ విషయంపై గ్రామస్థాయిలో సభలు నిర్వహించి ప్రజలను చైతన్య వంతులను చేయాలని జనసేన, తెలుగుదేశం నాయకులు భూ హక్కు చట్టం రద్దు చేయాలనే న్యాయవాదుల దీక్షకు మద్దతు పలికారు. మంగళవారం స్థానిక కోర్టు హాలు బయట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని జనసేన పిఎసి ఛైర్మన్ నాదెండ్ల మనోహార్, తెలుగుదేశం పార్టీ నాయకులు, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌లు సందర్శించి శిబిరంలో బైఠాయించి తమ పూర్తి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా భూ హక్కు చట్టం 512జీవోను తక్షణమే రద్దు చేయాలని న్యాయవాదులు తమ నిరసన గళాన్ని పెంచారు. 27/2023భూ హక్కు చట్టం వల్ల ప్రజల ఆస్తులకు భద్రత ఉండదని, ప్రైవేటు ఆస్తులపై ప్రభుత్వం పెత్తనం ఏమిటని ఈ విషయంలో న్యాయ వ్యవస్థను కూడా నిర్వీర్యం చేస్తున్న తీరును నిరశిస్తూ న్యాయవాదులు విధులు బహిష్కరించి రిలే దీక్షలను కొనసాగిస్తున్నారు. శిబిరానుద్దేశించి నాదెండ్ల మనోహార్ మాట్లాడుతూ ప్రభుత్వం వాస్తవంగా ప్రజలకు మేలు చేసే చట్టాలను చేసే విషయంలో చర్చలు నిర్వహించి ప్రజాభిప్రాయాలు సేకరించి తదనుగుణంగా చట్టాలు చేయాలని, ఇందుకు విరుద్ధంగా జగన్మోహనరెడ్డి పాలనలో వారికి, వారి తాబేదారులకు మేలు జరిగే విధంగా చట్టాలను చేసుకుంటూ ప్రశ్నించే వారి గొంతు నొక్కే విధానాన్ని అమలు చేస్తున్నారని ఆరోపించారు.

# విశాఖలో బాలికపై అత్యాచారం - 11 మంది అరెస్ట్

## మరో ఇద్దరు నిందితుల కోసం గాలింపు

**(విశాఖ క్రైమ్ - ప్రభాత వార్త) :** విశాఖలోని కంచరపాలెంలో ఒక అపార్ట్ మెంట్‌లో ఒడిశా నుంచి వచ్చిన ఓ కుటుంబం తమ కుమార్తెతో కలిసి జీవిస్తున్నారు. అక్కయ్యపాలెం సమీపంలో పోర్ట్ క్వార్టర్స్ ఏరియా సమీపంలోని మిలిటరీ ఇంజనీరింగ్ సర్వీసెస్ విభాగంలో పని చేస్తున్న ఒక కుటుంబం నివాసం ఉంటుంది. ఈ మేరకు వారి ఇంటిలో కుక్కలకు ఆహారం పెట్టి పని కోసం ఒక మనిషి కావాలని తెలిసిన వారు కోరడంతో ఒడిశ్శా కుటుంబం తమ కుమార్తెను ఆ పనిలో కుదిర్చారు. ఇదిలా ఉండగా ఆ ఇంటికి ఎదురుగా ఉన్న బిల్డింగ్‌లో టైల్స్ వర్క్ చేసే ఇమ్రాన్ అనే యువకుడితో బాలికకు పరిచయం ఏర్పడింది. ఇమ్రాన్ బాలికను ప్రేమిస్తున్నానని చెప్పడంతో నమ్మింది. ఆ బాలిక కూడా ఇమ్రాన్‌ను ప్రేమించింది. దీంతో డిసెంబర్ 17న అతడు బయటకు రమ్మని పిలిస్తే బాలిక వెళ్లింది. చీకటి పడినా తమ కుమార్తె ఇంటికి చేరుకోకపోవడంతో బాలిక తండ్రి 18న పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు.ఆ బాలికను వెతికే క్రమంలో ఝార్ఖండ్ కూడా వెళ్లారు పోలీసులు, బాలిక తల్లిదండ్రులు, ఆమె పనిచేసిన చోట స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఏపీలోని కొన్ని జిల్లాలు, ఝార్ఖండ్‌లో వెతికారు. అయితే ఎటువంటి సమాచారం లభించలేదు. ఈ క్రమంలో బాలిక ఒడిశాలోనే ఉన్నట్లు గుర్తించారు. బాలికను గుర్తించి విశాఖకు తీసుకొచ్చారు. డిసెంబర్ 17న ఇమ్రాన్‌తో కలిసి బయటకు వెళ్లిన బాలికను ఒక హోటల్‌లో రేప్ చేశారు. ఆ తర్వాత అతడి స్నేహితుడిని ఆ హోటల్‌కు రమ్మని ఫోన్ చేశాడు. అతడు కూడా ఆ బాలికను బెదిరించి రేప్ చేశాడు. అక్కడ నుంచి ఆ బాలిక తప్పించుకుంది. తాను ప్రేమించిన వ్యక్తి తనని ఇలా మోసం చేయడంతో ఆ బాలిక కుంగిపోయింది. ఏం చేయాలో తెలియక బీచ్‌కు చేరుకుని అక్కడ ఏడుస్తూ కూర్చుంది. బాలిక ఏడవడాన్ని అక్కడున్న సందర్శకులు చాలా మంది గమనించారు. కానీ ఎవరూ ఆమెను ప్రశ్నించలేదు. అయితే బీచ్‌లో సందర్శకులకు ఫొటోలు తీసే ఒక వ్యక్తి ఆ బాలికను చేరుకుని విషయం అడిగి తెలుసుకున్నాడు. ఆమెను ఓదారుస్తూ ఆమెకు మంచి మాటలు చెప్పాడు. ఆమెను తనతో ఫ్రెండ్ రూంకి తీసుకుని వెళ్లాడు. అక్కడ అతనితో పాటు మరో ఏడుగురు కలిసి ఆ బాలికను అత్యాచారం చేశారు. ఆ తర్వాత సిటీలోని పలు లాడ్జీలు, హోటల్స్ తిప్పుతూ ఆ బాలికపై డిసెంబర్ 22వ తేదీ వరకు ఈ ఎనిమిది మంది పలుమార్లు అత్యాచారం చేశారు. ఆ తర్వాతవారి నుంచి ఎలాగోలా తప్పించుకుని ఆ బాలిక తన గ్రామానికి చేరుకుంది. ఆ విషయం తెలిసిన పోలీసులు ఆ గ్రామానికి బాలిక తల్లిదండ్రుల సహాయంతో చేరుకుని విశాఖ తీసుకుని వచ్చారు. డిసెంబర్ 17వ తేదీ నుంచి డిసెంబర 22 వ తేదీ వరకు తనను పలు మార్లు అత్యాచారం చేశారని బాలిక పోలీసులకు చెప్పింది. బాలిక చెప్పిన వివరాలు ఆధారంగా పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. 13 మందిలో మొత్తం 11 మంది నిందితులను అరెస్టు చేశామని, మిగిలిన ఇద్దరి కోసం ప్రత్యేక బృందాలను నియమించామని డీసీపీ శ్రీనివాస్ తెలిపారు. 11 మంది నిందితులను 14 రోజులు రిమాండ్‌కు తరలించారు.

# రైల్వే అభివృద్ధి పనులపై జిఎంతో చర్చించిన ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

**గుంతకల్లు రైల్వే, జనవరి 2 ప్రభాతవార్త** దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజనల్‌ప్రధాన కేంద్రంలో దీర్ఘకాలంగా అపరిస్కృతంగా ఉన్న పలు ప్రజా సమస్యలు, వివిధ అభివృద్ధి పనులను చేపట్టే అంశాలపై స్తానిక ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ దృష్టికి తీసుకెళ్లారు. పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న గుంతకల్లు-ధర్మవరం సెక్షన్‌లోని గూళ ్యపాలెం-గుంతకల్లు రైల్వే స్టేషన్ల మధ్య గల ధర్మవరం లెవెల్ క్రాసింగ్ గేట్‌కు సంబంధించిన ఆర్‌యుబి వంతెన పనులను, కసాపురం వంతెనను వెడల్పు చేయడంతోపాటు, స్థానిక రోటరీ క్లబ్ వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జిను తగినన్ని నిధులు కేటాయించి వాటిని తక్షణ నిర్మించాలని ఆయన జీఎం జైన్‌ను కోరారు. అలాగే రైల్వే సర్వీసులపై, పలు ప్రజా సమస్యలకు సంబంధించి వాటి పరిష్కారానికి వివరించి చర్చించారు. ఇందుకు జీఎం సానుకూలంగా స్పందించినట్లు రైల్వే వర్గాల సమాచారం. సమావేశంలో వైసీపీ స్థానిక నాయకులు, రైల్వేకు చెందిన ప్రిన్సిపాల్ ఉన్నతాధికారులు కెఆర్‌కె.రెడ్డి, కె.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కార్యకర్తలు విధుల్లోకి చేరండి, లేదంటే కఠిన చర్యలు : కలెక్టర్ గౌతమి

**అనంతపురం, జనవరి 2 ప్రభాతవార్త బ్యూరో** అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు వెంటనే తమ ఆందోళనలను వీడనాడి ఉద్యోగాల్లోకి చేరాలని జిల్లా కలెక్టర్ గౌతమి విజ్ఞప్తి చేశారు. అంగన్వాడీ కార్యకర్తల ఆందోళనల వల్ల పిల్లలు, బాలింతలు, గర్భవతుల ఇక్కట్లకు గరవుతున్నందున అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు వెంటనే తమ ఆందోళనలను వీడనాడి విధుల్లోకి చేరాలి. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించిందన్న విషయాన్ని దృష్టిలో ఉంచుకుని నిరసన కార్యక్రమాలు వీడనాడి విధుల్లోకి చేరాలని, అట్లు చేరకపోతే ప్రభుత్వ ఆదేశాల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ గౌతమి ఒక ప్రకటనలో హెచ్చరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు 11 డిమాండ్లతో డిసెంబర్ 12వ తేది నుంచి నిరవదిక సమ్మె చేస్తున్నారు.

మంత్రుల బృందం ప్రభుత్వ కార్యదర్శి, ముఖ్య కార్యదర్శి, మహిళా అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, ఆర్థిక శాఖ, వివిధ స్థాయిల్లో అనేక దఫాలుగా చర్చల తర్వాత ప్రభుత్వం కొన్ని డిమాండ్లను అంగీకరించిందని ఆమె తెలిపారు. అందుకు అనుగుణంగా ప్రభుత్వ జీవోలను కూడా జారీ చేసిందని అందుకు అవసరమైన నిధులను కూడా విడుదల చేసిందని ఆమె తెలియజేసిందన్నారు. పెండింగ్‌లో ఉన్న అద్దెలు, కూరగాయలు, పోపు దినుసులు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ ఖర్చులు, నిర్వహణ చార్జీలును ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. అంగన్‌వాడీ సహాయకులను అంగన్‌వాడీ కార్యకర్తలుగా పదోన్నతి కల్పించేందుకు వయో పరిమితిని 45 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంచుతూ జీవో నెంబర్ 44ను జారీ చేసినట్లు ఆమె గుర్తు చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు



నెలకొకసారి, అంగన్‌వాడీ సహాయకులకు రెండు నెలలకోసారి టిఎడిఎ, క్లైం చేసుకోవడానికి గత డిసెంబర్ 20వ తేది నుంచి అమలు అయ్యే విధంగా ఉత్తర్వులు ఇచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. అంగన్‌వాడీ సహాయకుల, కార్యకర్తల గరిష్ట వయోపరిమితిని 62 సంవత్సరాలుగా నిర్ణయించినట్లు ఆమె తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలకు అద్దెకింద 66.54 కోట్లు, పరిపాలన ఖర్చుల కింద 7.84 కోట్లు, చిన్నచిన్న మరమ్మత్తుల కోసం 6.36 కోట్ల రూపాయలను బడ్జెట్ కింద ప్రభుత్వం విడుదల చేసిందని ఆమె తెలిపారు.

2019 నుంచి అంగన్‌వాడీ వర్కర్ల జీతాలను 11,500, మినీ అంగన్‌వాడీ జీతాలను 7,000లకు, అంగన్‌వాడీ హెల్పర్ల జీతాలను 7వేలకు, అలాగే 2013 నుంచి అంగన్‌వాడీ కార్యకర్తలకు సూపర్‌వైజర్లుగా ప్రమోషన్లు ఇవ్వలేదు. రాష్ట్ర విభజన తర్వాత తొలిసారిగా ప్రమోషన్లు ఇచ్చి 560 గ్రేడ్-2 సూపర్‌వసజర్ పోస్టులను భర్తీ చేయడం జరిగింది. ఇదే సందర్భంలో సూపర్‌వైజర్ పోస్టులకు పరీక్షలు రాసి వారి వయోపరిమితిని 45 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంచుతూ వారి అనుకూల నిర్ణయాన్ని ప్రభత్వం తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. దీంతో 9 ఏళ్లుగా ప్రమోషన్‌కోసం ఎదురు చూస్తున్న వారిలో ఎక్కువమంది పోటీ పడే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు.

# ఎమ్మెల్యే ఎంఎస్ బాబు తిరుగుబాటు!

- నేను ఒక్కడినే ఓడిపోతానని నివేదిక వచ్చిందా? ఆగ్రహం వ్యక్తం చేసిన నేత

**చిత్తూరు, కాణిపాకం, జనవరి 2 ప్రభాతవార్త:** పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు వైకాపా అధిష్టానంపై తిరుగుబాటు జెండా ఎగురవేశారు.



ఐదేళ్ళు పూతలపట్టు నియోజకవర్గ ప్రజల సమస్యలను పరిష్కరించడానికి శక్తి వంచన లేకుండా కృషి చేసిన తనకు 2024 అసెంబ్లీ ఎన్నికల్లో వైకాపా అభ్యర్థిత్వం కేటాయించకుండా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌ను ఎంపిక చేయడం ఏమిటని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు మంగళవారం అసంతృప్తి వెళ్ళగక్కారు. చిత్తూరులో ఆయన మాట్లాడుతూ పార్టీ అధిష్టానం ఖరారు చేసిన కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్ళి సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి ప్రజల్లో మంచి పేరు వచ్చేలా చేశానని, 2024 ఎన్నికల్లో తనను పూతలపట్టు వైకాపా అభ్యర్థిగా మరోసారి ఎంపిక చేయకపోవడానికి తాను చేసిన తప్పు ఏమిటో అర్థం కావడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఏర్పడిన ఈ నాలుగన్నర సంవత్సరాల కాలంలో సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఒక్కసారి సైతం తనతో మాట్లాడలేదన్నారు. ఏడాదిలో ఒకసారి ఎమ్మెల్యేలను పిలిచి నియోజకవర్గంలో మీరు చేస్తున్నది తప్పు! ఇలా చేయవద్దు! నేను చెప్పినట్లు చేయండి! అని చెప్పి వుంటే ఆ మేరకు నడుచుకొని వుండేవాళ్ళమన్నారు. ప్రజల్లో వున్న వారికే ఈ సారి అభ్యర్థిత్వాలు అని స్పష్టం చేయడంతో ఐదేళ్ళుగా తాను ప్రజల్లోనే వున్నానన్నారు. సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఖరారు చేయకముందే ఆరు నెలల క్రితమే తాను నియోజకవర్గంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించి ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించడానికి చిత్తశుద్ధితో కృషి చేశానన్నారు. ఇప్పుడేమో సర్వేలో నీ పనితీరు బాగలేదని చెప్తున్నారని, ఇప్పటి వరకు తాను నియోజకవర్గంలో ఇద్దరు నేతలు చెప్పినట్లే నడచుకొన్నారని, చెడ్డ పేరు వస్తే వారికి రావాలి, కానీ తాను ఏమి చేశానని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు నిలదీశారు. పార్టీలో దళిత ఎమ్మెల్యేలు అంటేనే ఇలా చేస్తున్నారని, తిరుపతి జిల్లాలో పనితీరు బాగలేని ఎమ్మెల్యేలు వున్నప్పటికీ వారిని ఎవ్వరిని మార్చకుండా దళితుడైన తనను మాత్రమే మార్చడం ఏమిటని ఆయన ప్రశ్నించారు.



# వైఎస్సార్సీలో చేరిన బళ్లారి మాజీ ఎంపి జై శాంత

## - మాజీ మంత్రి శ్రీరాములు సోదరిగా గుర్తింపు

**అనంతపురం, జనవరి 2 ప్రభాతవార్త బ్యూరో** బళ్లారి జిల్లా రాజకీయాల్లో చక్రం తిప్పిన వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన మాజీ మంత్రి శ్రీరాములు సోదరి బళ్లారి మ ఆజీ ఎంపి జె.శాంత మంగళవారం వైసీపీలో చేరారు. జె.శాంత భారతీయ జనతాపార్టీకి రాజీనామా చేసి రాష్ట్ర ము ఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైసీపీలో చేరి వైసిపి కండువా కప్పుకున్నారు. వైసీపీ రీజనల్ ఇన్‌చార్జ్, ఎంపి మిథున్‌రెడ్డి కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తాడేపల్లిలోని సీఎం నివాసంలో మాజీ ఎంపి శాంత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరిపోవడం ఉమ్మడి అనంతపురం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన శాంత అనంతపురంజిల్లా గుంతకల్లులో వివాహం చేసుకుంది. సామాన్య మధ్య తరగతి కుటుంబానికి చెందిన శాంతకు గతంలో బళ్లారి ప్రాంతానికి చెందిన కీలక నేత, మాజీ మంత్రి శ్రీరాములు, ఓబులాపురం మైనింగ్ అధినేత గాలి జనార్ధన్‌రెడ్డి సహకారం వల్ల బళ్లారి ఎంపిగా 2009 ఎన్నికల్లో బరిలో దిగి ఎంపి అయ్యింది. తెలుగు, కన్నడ భాషల్లో ఎదుటివారిని ఆకట్టుకునే స్వభావం శాంతకు ఉంది. ఇదే సమయంలో 2009 లోక్ స భ ఎన్నికల్లో కడప స్థానం నుంచి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంపిగా గెలిచి ల ఓక్ సభలో అడుగు పెట్టారు. ఆ విధంగా ఇద్దరు లోక్ సభలో ఒకేసారి ప్రవేశించారు. ఈ నేపథ్యంలో కొన్ని సార్లు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పార్లమెంట్‌లోని సెంట్రల్ హాల్‌లో కలుసుకున్న సందర్భాలు ఉన్నాయి. కానీ ఆ తర్వాత సీఎం జగన్‌తో ఎప్పుడు కలవలేదని మాజీ ఎంపి శాంత తన సన్నిహితులతో చెబుతోంది. ప్రస్తుతం నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు మార్పులో భాగంగా వైసీపీ అధిష్టాన వర్గం పావులు కదుపుతోంది.

# మత్స్యకారుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు : కేంద్రమంత్రి పురుషోత్తం

**రేపల్లె (బాపట్ల జిల్లా), జనవరి 2, ప్రభాతవార్త :** సాగర్ పరిశ్రమతో సముద్ర తీర ప్రాంతాలలోని మత్యకారుల జీవితాలు అభివృద్ధి చెందుతాయని కేంద్ర మంత్రి పశుసంవర్ధకశాఖామంత్రి పురుషోత్తం రూపాల అన్నారు. మంగళవారం నియోజకవర్గం లోని నిజాంపట్నం హార్బర్‌ను ఆయన సందర్శించారు. ఫిషింగ్ హార బ్ర్ ప్రాంతాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారులతో ముఖాముఃః మాట్లాడుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మత్స్యకార అభివృద్ధి పథకాలలో మత్స్యకారులకు మేలు జరిగేవిధంగా అభివృద్ధి చేస్తామని ఆయన తెలియచేశారు. 150 మంది మత్స్యకారులకు కిసాన్ క్రెడిట్‌కార్డుల ద్వారా 48లక్షల రుణాలను ఆయన అందచేశారు. అలాగే మత్స్యకారులకు, మత్స్య సంపద వేటకు అవసరమైన పరికరాలు, వారి ప్రాణ రక్షణకు అవసరమైన సాధనాలను మంత్రి చేతులమీదుగా పంపిణీ చేశారు. మత్స్యకారుల సమస్యలన్ని పరిష్కరించటానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని కేంద్ర మంత్రి పురుషోత్తమ రూపాల అన్నారు. 2030 సంవత్సరం నాటికి విదేశాలకు లక్ష కోట్ల విలువైన మత్స్య సంపద ఎగుమతికి ప్రణాళిక బంధంగా పనిచేస్తుందని తెలియచేశారు. సాగర్ పరిశ్రమ కార్యక్రమాన్ని ఒకొక్క పరిశ్రమ ద్వారా 146.15 లక్షల మందికి లబ్ధి చేకూరుతుందన్నారు. 10 తీర ప్రాంత రాష్ట్రాలలో 88 ప్రాంతాలలో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. మత్స్య సంపదపై ఆధారు పడిన మత్స్యకారులకు అధికంగా రాయితీలు కల్పించాల్సిన అవసరం ఉందని బాపట్ల పార్లమెంట్ సభ్యులు నందిగామ సురేష్ అన్నారు. రాష్ట్రముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి మత్స్యకారుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు, రేపల్లె నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జి ఈవూరు గణేష్, బుడా ఛైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, మత్స్యశాఖ అధికారి సురేష్ ఉన్నారు.

# ఇంద్రకీలాద్రిలో భవానీ దీక్ష విరమణ ఏర్పాట్లు పూర్తి

**ఇంద్రకీలాద్రి, జనవరి 2, ప్రభాతువార్త'** దుర్గమ్మ భక్తులు ఎంతో ప్రీతిపాత్రంగా స్వీకరించి భవానీ మాల ధారణ విరమణకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. జరిగిన ఏర్పాట్లను విజయవాడ డిసిపి విశాల్‌గున్ని మంగళవారం పరిశీలించారు. కెనాల్‌రోడ్డు వినాయకుడి గుడి వద్దనుండి దుర్గమ్మను దర్శించుకోటానికి వచ్చే భక్తులకు క్యూలైన్లు, గిరిప్రదక్షిణ ఏర్పాట్లు, సీతమ్మవారి పాదాల వద్ద ఏర్పాట్లు చేసిన కేశఖండన శాలలు, స్నానపు ఘాట్లు, టికెట్‌కౌంటర్లు, హోల్డింగ్ ఏరియాలు, కొబ్బరికాయలు కొట్టేఏర్పాట్లు, ఇరుముడి పాయింట్లు, హోమగుండాలు, ప్రసాదం కౌంటర్లు, అన్నదానం ఏర్పాట్లు తదితర ఏర్పాట్లను ఆలయ ఛైర్మన్ కర్నాటి రాంబాబు తో కలిసి పరిశీలించారు. విద్యుత్‌దీపకాంతులతో ఇంద్రకీలాద్రి దగద్దగాయమానంగా శోభిస్తూ అపరకైలాసాన్ని తలపిస్తోంది. ఈ సందర్భంగా ఇఓ కెఎస్ రామారావు దీక్షా విరమణలకు చేసిన ఏర్పాట్లను వెల్లడించారు. బుదవారం 3వ తేదీ నుండి 7వ తేదీ వరకు దీక్ష విరమణలుంటాయన్నారు. ఈ సందర్భంగా మొదటిరోజు ఉదయం 6 గంటలకు దుర్గమ్మ దర్శనం ప్రారంభమవుతుందన్నారు. 7వ తేదీ



వరకు ఉదయం 3 గంటల నుండి రాత్రి 11 గంటలవరకు దుర్గమ్మ దర్శించుకునేలా ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతిరోజూ సుమారుగా 50వేల నుండి లక్ష మంది వరకు భవానీ భక్తులు దుర్గమ్మ దర్శనానికి తరలి రావచ్చని, చివరి రెండు రోజులు లక్ష నుండి లక్షన్నర మంది వరకు భవానీలు తరలి రావచ్చని అంచనాతో ఏర్పాట్లు చేశామన్నారు. ఉచిత దర్శనానికి 2 క్యూలైన్లు, రు.100 ల టికెట్ దర్శనానికి, రు.300 ల టికెట్ బంగారు వాకిలి దర్శనానికి ఒక క్యూలైన్ చొప్పున మొత్తం 3 క్యూలైన్లు వినాయకుడి గుడి వద్ద నుండి ఏర్పాటు చేశామన్నారు. ఓం టర్నింగ్ పాయింట్ వద్ద అదనపు ఉచిత దర్శన క్యూలైన్, రు.300 దర్శనానికి ఒక క్యూలైన్ లతో కలిపి మొత్తం 5 క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు. దర్శన టికెట్లు విఎంసి ఆఫీస్ (ప్రధాన మున్సిపల్ కార్యాలయం), ఆలయ టోల్‌గేట్, ఓం టర్నింగ్‌పాయింట్‌ల వద్ద కరెంట్ బుకింగ్ కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. కొండకింద శివాలయం మెట్ల దిగువన 4 హోమగుండాలు ఏర్పాటు చేశామన్నారు. 3వ తేదీ ఉదయం 6 గంటలకు హోమగుండాలు ప్రారంభిస్తామన్నారు. 110 స్టాండ్‌లను ఇరుముడి సమర్పణలకు ఏర్పాటు చేశామన్నారు. తాత్కాలిక క్యూమార్గంలో వాటర్‌ప్రూఫ్ షామియానాలు, కోయిర్ మ్యాట్లు, తాత్కాలిక విద్యుదలంకరణ ఏర్పాటు చేశామన్నారు. తాగునీరు విఎంసి ద్వారా అందించేలా ఏర్పాటు జరిగిందన్నారు. 17లక్షల లడ్డూలు అందుబాటులో వుంచామన్నారు. కనకదుర్గానగర్‌లో 11 ప్రసాదం కౌంటర్లుఏర్పాటు చేశామన్నారు.

# కలెక్టరేట్లో ఆత్మహత్యాయత్నం

**నెల్లూరు అర్బన్,జనవరి2,ప్రభాతవార్త** నెల్లూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద మంగళవారం ఉదయం కిరోసిన్ పోసుకుని ఆత్మహత్య ప్రయత్నం చేసిన రైతు వెంకటరామయ్య సంఘటపై జిల్లా కలెక్టర్ హరి నారాయణన్ స్పందించారు.జలదంకి మండలం మద్దూరుపాడు గ్రామానికి చెందిన రైతు వెంకటరామయ్య తన భూమిలోకి తనను కొంతమంది రానివ్వడంలేదని, మండల స్థాయి అధికారులకు చెప్పినప్పటికీ ఉపయోగం లేకుండా పోయిందని ఆవేదనతో నెల్లూరు కలెక్టరేట్లో ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు.విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ వెంటనే రైతు వద్దకు వెళ్లి సమస్య పరిష్కరించాలని డిఆర్‌ఓ లవన్నకు ఆదేశించారు.రైతు వద్దకు వెళ్లిన డిఆర్‌ఓ రైతు సమస్యలు తెలుసుకుని,సమస్యపై సమగ్ర నివేదిక ఇవ్వాలని జలదంకి తహాశీల్దార్‌ను ఆదేశించారు.కావలి ఆర్డిఓ,డిఎస్పీలతో మాట్లాడారు.రైతును భూమిలోకి వెళ్లకుండా అడ్డుకుంటున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలని డిఆర్వో లవన్న ఆర్డీవోకు తెలిపారు.

# సచివాలయ భవన ప్రారంభోత్సవానికి పార్టీ శ్రేణులు దూరం

## వర్గాలుగా విడిపోతున్న నాయకులు, కార్యకర్తలు

**అంబాజీపేట,జనవరి 02, ప్రభాతవార్త..** మండలంలోని తొండవరం గ్రామంలో రూ.25 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని సర్పంచి పేరాబత్తుల రామలింగరాజు (దొరబాబు) ఆదర్వ్యంలో పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు మంగళవారం ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు వాకపల్లి శ్రీ వెంకట కాశీవిశ్వనాథం ( దొరబాబు),వైసీపీ నాయకులు మద్దింశెట్టి పుల్లయ్యనాయుడు,వాకపల్లి శ్రీను,కేతా రాజు,గోగి శ్రీరామమూర్తి,మద్దింశెట్టి మల్లిబాబు,పేరాబత్తుల కొండలరావు తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే వస్తున్నారంటే మండల కమిటీతో పాటు,ఆయా గ్రామ కమిటీలు చేసే హడావిడి అంతాయింతాకాదు.షామియానాల ఏర్పాటు నుండి కుర్చీలు వేయడం,ఫ్లెక్సీలు కట్టడం వంటి పనులు పార్టీ నాయకులే చేసేవారు.ఆయా గ్రామ కమిటీలు,మండల కమిటీలు పోటాపోటీగా పార్టీ నాయకులకు,అభిమానులకు, గ్రామస్తులకు సమాచారం అందించేవారు.ఆ సమాచారం అందలేదనే నెపంతో కొంతమంది,ఎమ్మెల్యే చిట్టిబాబు వ్యతిరేక వర్గంనకు చెందిన కొంతమంది ప్రారంభత్సవం



గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే చిట్టిబాబు

కార్యక్రమానికి రాకపోవడంతో వైసీపీ ఉనికి ఎక్కడా కనిపించకుండా పోయింది.తొండవరంలో సచివాలయ భవనం ప్రారంభత్సవం చేస్తున్నట్లు స్థానిక గ్రామ కమిటీలో కొంతమందికి సమాచారం లేకపోవడంతో పాటు,గ్రామశాఖ అద్యక్షుడు,ఎంపీపీ, జెడ్పీటీసీ,సొసైటీ త్రిసభ్య కమిటీ ఛైర్‌పర్సన్, మండలశాఖ అద్యక్ష,కార్యదర్శులు,మండలంలోని మండల,జిల్లా, రాష్ట్రస్థాయి నాయకులు పాల్గొనకపోవడంతో (కారణాలు ఏమైనా కావచ్చు) పలువురు పలు విధాలుగా చర్చించుకుంటున్నారు.

